
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
సోమవారం 3 మార్చి 2025

భూసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఆలోచన ఉన్నతంగా ఉన్నా.... దాని ఆచరణలో మాత్రం ఆశించిన ఫలితాలు కనిపించడంలేదు. భూ సమస్య అనేది ఒకసారి అధికారుల దృష్టికి వచ్చాక, మరోసారి ఆ సమస్యతో బాధితుడు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రభుత్వం సూచిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ఇంకా నిర్లక్ష్యం కనిపిస్తూనే ఉంది. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలు.. ఇప్పటివరకూ జరిగిన పరిష్కారాలను ఓ సారి పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.


మర్రిపాడు జాతీయ రహదారి వెంబడి ఉన్న ప్రభుత్వ భూమిలో జామాయిల్ మొక్కలు నాటిన ఆక్రమణదారులు

పరిష్కారమెప్పుడు...?

- రెవెన్యూ సదస్సుల్లో కోకొల్లలుగా భూసమస్యలు
- తీర్చడంలో అధికారుల నిర్లక్ష్యం
- రెండు నెలలు గడిచినా ఇంకా 33 శాతం పెండింగ్
- ప్రభుత్వ భూఆక్రమణల తొలగింపులోనూ జాప్యం
- ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా.. మారని రెవెన్యూ అధికారుల తీరు

నెల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లో 8,178 అర్జీలు అందాయి. రెండు నెలలు గడిచాక కూడా ఇంకా 2,762 అర్జీలకు పరిష్కారం దొరక లేదు. అంటే మూడోవంతు సమస్య లను పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం కనిపిస్తోంది. కొన్ని మండలాల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అటువంటి మండలాల అధికారులను కలెక్టర్, జేసీలు పదే పదే హెచ్చరిస్తున్నా ఫలితం ఉండడం లేదు. ఆఖరుకు ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను కాపాడడంలో కూడా రెవెన్యూ యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

● భారీగా భూసమస్యలు

ఎన్నడూ లేనివిధంగా వైసీపీ ప్రభుత్వంలో భూ సమస్యలు విపరీతమయ్యాయి. నాడు అధికార బలంతో సామాన్యుల భూములను వివాదంలోకి తీసుకెళ్లారు. విచ్చల విడిగా భూరికార్డులు మార్చేయడం, ఖాళీగా ఉంటే ఆక్రమించేయడం వంటి అనేక ఘటనలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతి నిధుల వద్దకు భూబా. ధితులు బారులు తీరారు. ఈ పరిస్థితి చూసిన ప్రభుత్వం.. భూ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. డిసెంబరు ఆరు నుంచి జనవరి 8 వరకు ఈ సదస్సులు జరిగాయి. జిల్లాలో మొత్తం 731 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులను పర్యవేక్షించడానికి ప్రతీ మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని స్పెషలాఫీసర్‌గా కలెక్టర్ నియమించారు. ప్రతీ మండలంలో రోజుకొక గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులకు స్పెషలాఫీసర్లతోపాటు తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్వోలు పూర్తి రికార్డులతో హాజరయ్యారు. భూవివాదాలకు సంబంధించిన ప్రతీ అర్జీని స్వీకరిం చారు. అక్కడికక్కడే పరిష్కరించదగిన సమస్యలను వెంటనే పరిష్కరించారు. మొత్తంగా నెల పాటు జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 8178 అర్జీలు ప్రజల నుంచి అందాయి. వీటిలో నగం వరకూ ఆర్‌వోఆర్(రైట్స్ ఆఫ్ రికార్డ్స్)కు సంబంధించిన సమస్యలే కావడం గమ నార్హం. ల్యాండ్ గ్రాబింగ్, ప్రభుత్వ భూముల ఆక్రమణలు వంటి అనేక నేరాలు ఈ రెవెన్యూ సదస్సుల వేదికగా వెలుగు చూశాయి.

● పరిష్కారంలో జాప్యం

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన కొన్ని చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఇలాంటివి సుమారు రెండు వేల వరకూ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మిగిలిన సమస్యల పరిష్కారంలోనే జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకూ మొత్తం అర్జీలు 8178కు గానూ 5416 అర్జీలను పరిష్కరించారు. ఈ అర్జీల్లో 4106 అర్జీలు ఆర్‌వోఆర్‌కు సంబంధించినవిగా ఉన్నాయి. అంటే భూహక్కులకు సంబంధించినవి. వీటిలో 2812 సమస్యలను పరిష్కరించగా ఇంకా 1294 సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. ప్రభుత్వ భూములను ఆక్రమించారని 108 అర్జీలు రాగా ఇప్పటి వరకూ 23 పరిష్కరించారు. మరో 85 అర్జీలను పరిష్కరించాల్సి ఉంది. ఉదాహరణకు.. రాపూరు మండలం శానాయపాలెం గ్రామ పరిధిలో కండలేరు జలాశయానికి ప్రభుత్వం అప్పగించిన భూమిని ఇతరులు నిమ్మ చెట్లు వేసుకొని సాగు చేసుకుంటున్నారు. ఈ ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చినా వాటిని పట్టించుకోని మండలాధికారులు.. ఆ ఆక్రమణదారుల సౌలభ్యం కోసం ఏకంగా దారిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తుండడాన్ని బట్టి క్షేత్రస్థాయి పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు. కాగా ల్యాండ్ గ్రాబింగ్‌కు సంబంధించి రెవెన్యూ సదస్సుల్లో 78 సమస్యలు రెవెన్యూ సదస్సుల్లో నమోదు కాగా ఇప్పటికి 15 మాత్రమే పరిష్కరించారు. ఇంకా 63 సమస్యలకు పరిష్కారం దొరకలేదు. ఇక దారి వివాదాలకు సంబంధించి 42 సమస్యలు రాగా, కేవలం 13 మాత్రమే పరిష్కరించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో ముత్తుకూరు, గుడ్లూరు, సంగం, సైదాపురం, దగదర్తి, ఆత్మకూరు, వలేటివారిపాలెం, కావలి, కలిగిరి, జలదంకి, మర్రిపాడు, వింజమూరు వంటి మండలాలు వెనుకబడి ఉన్నాయి. పొదలకూరు, తోటపల్లి గూడూరు, రాపూరు, ఏఎస్‌పేట, కలువాయి, చేజర్ల వంటి మండలాల్లో తక్కువ సమస్యలు నమోదైనా వాటిని పరిష్కరించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

నేటి నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలు

- జిల్లాలో 25,024 మంది విద్యార్థులు
- 79 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(విద్య), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమ వారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని 79 కేంద్రాల్లో కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు అన్నీ ఏర్పాట్లు చేశారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేం ద్రానికి చేరుకోవాలని, 9గంటలు దాటాక కేంద్రంలోకి అనుమతిం చమని అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు జనరల్ విభాగంలో 23,994, ఒకేషనల్‌లో 1,030 మంది కలిపి 25,024 మంది హాజరవుతున్నారన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు 1400 మంది సిబ్బందిని, షైప వర్ కమిటీతో పాటు జిల్లా పరీక్షల కమిటీ, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఐదు సిట్టింగ్ స్క్వాడ్ లను నియమిం చామని అధికా రులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు జెరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశామని వారు తెలిపారు. అలాగే సీసీ కెమెరాల నిఘా నీడలో జరిగే ఈపరీక్షల కేంద్రాల్లోకి, విద్యార్థులు, ఇన్విజిలేటర్లు ఎవరూ కూడా సెల్‌ఫోన్లు, క్యాలుక్‌లేటర్లు, అభ్యంతరకరమైన వస్తువులు, ఇతర కాగితాలను అనుమతించబోమన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

జిల్లాలో గుర్తించిన 12 సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, బందోబస్తును కట్టుదిట్టం చేశామని అధికారులు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 28 జోన్‌ల పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ప్రశ్నపత్రాలను భద్రపరిచి, పరీక్షకు అరగంట ముందుగా స్టేషన్ నుంచి తీసుకెళ్లేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. జిల్లాలో ప్రత్యేకావసరాలు కలిగిన విద్యార్థులకు స్క్రైబ్ సౌకర్యంతోపాటు పరీక్ష కేంద్రంలోని కింద గదుల్లోనే పరీక్ష రాసే వెసులుబాటు కల్పించామన్నారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులను తనిఖీ చేసేందుకు బాలురకు, బాలికలకు వేర్వేరుగా సిబ్బందిని నియమించామని ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసుశాఖతో చర్చించి అన్నీ చర్యలు తీసు కున్నామన్నారు. తమ పిల్లలను అరగంట ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకునేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా, కంగారు పడకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలని ఆర్ఐవో సూచించారు.


కావలి మునునూరు రైల్వే ట్రాక్‌కు పడమర వైపున కబ్జాకు గురైన డొంక రోడ్డు, శ్మశానం దారి

- కావలిలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలాలు
- నకిలీ పట్టాలతో కాలనీల్లో హల్‌చల్
- నిజమైన లబ్ధిదారులకు బెదిరింపులు
- ఆక్రమణదారులకు అండగా నాడు వైసీపీ నాయకులు.. నేడు టీడీపీ నేత
- పట్టించుకోని పాలకులు, రెవెన్యూ అధికారులు

దర్జాగా కబ్జా!

కావలి రూరల్, మార్చి2(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వం రిజర్వ్ చేసి ఉంచిన స్థలాలు, శ్మశాన వాటికలు, వాటిదారులు, డొంకలను ఆక్రమణదారులు దర్జాగా కబ్జా చేస్తు న్నారు. కావలి కనకపట్నంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో భూముల ధరలు బాగా పెరిగాయి. దీంతో కబ్జాదారులు పట్టణ శివార్లలో ఉన్న ప్రభుత్వ భూములపై కన్నేశారు. నకిలీ పట్టాలతో ఆక్రమించి, అమ్మకాలు సాగిస్తున్నారు. అయినా పాలకులుకానీ, రెవెన్యూ అధికారులు కానీ పట్టించుకోవటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● భూముల ధరలు పెరగడంతో...

కావలి ముసునూరు శివారు ఇందిరమ్మ కాలనీలో సుమారు 15 ఏళ్ల క్రితం విశాలమైన రోడ్లతో లేఅవుట్లు వేసి సుమారు 6,000 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. నేడు పట్టణ పరిధితోపాటు, భూముల ధరలు పెరిగాయి. అప్పటి కాలనీల్లో లేఅవుట్లకు పోను ఇతర అవసరాల కోసం రిజర్వ్‌లో ఉన్న స్థలాలను, నాటి వైసీపీ నాయకులు, నేటి ఓ టీడీపీ నేత అండతో కొందరు ఆక్రమిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు రెవెన్యూ ఉద్యోగుల అండతో గతంలో ఇక్కడ పనిచేసిన వెళ్లిన తహసీల్దార్లు ఇచ్చినట్లు ఫోర్జరీ స్టాంపులు, సంతకాలతో నకిలీ పట్టాలు సృష్టించి, అమ్మకాలు సాగిస్తున్నారు. ముసునూరు ఆటోస్టాండ్ నుంచి పాత రైల్వేగేటు మీదుగా బుడంగుంట వెళ్లే మార్గంలో రైలు కట్టకు పడమర వైపున ఉన్న దారిని వైసీపీ అధికారంలో ఉండగా, ఆ పార్టీ చోటా నేతలు ఆక్రమించారు. అలాగే ముసునూ రులోని ఎస్సీ, బీసీ, ఓసీలకు చెందిన 300 కుటుంబాలవారు రైల్వేట్రాక్‌కు తూర్పున నివాసం ఉన్నారు. పడమర వైపున వినాయక ఆ కాలనీ పక్కనే ఉన్న శ్మశానవాటికు వెళ్లే దారిని వైసీపీ నేతలు కబ్జాచేసినా పట్టించుకునే వారు కరువ య్యారని స్థానికులు వాపో యారు. దీనికితోడు ఇందిరమ్మకాలనీలో లేఅవుట్లు వేసి పట్టాలు ఇవ్వగా, లేఅవుట్లు పోను రిజర్వ్‌లో ఉన్న స్థలాలు, రోడ్లు క్రాస్ బిట్లను కబ్జా చేసేశారు. లేఅవుట్‌లోని లబ్ధిదారుల పేరున ఉన్న ఖాళీ స్థలాలకు కూడా నకిలీ పట్టాలు సృష్టించి, వారికి తెలియకుం డానే ఇతరులకు అమ్మేశారు. ఇదేమని ప్రశ్నిస్తే ఈ స్థలంలో మీరు ఇల్లు కట్టుకోనందున ఈ స్థలం తహసీల్దార్ మాకు కేటాయించి, పట్టా ఇచ్చారంటూ బెదిరింపులకు దిగుతున్నారు. కాగా పట్టణంలోని వెంగళరావునగర్‌కి చెందిన జ్యోతి అనే మహిళకు 2008లో అట్లల ఫ్యాక్టరీ సమీపంలో ప్రభుత్వం వేసిన లేవుట్‌లో ప్లాటు కేటాయించారు. అయితే అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకపోవటంతో ఆమె బేసుమెంట్ వేసుకుని జీవనోపాధి కోసం నెల్లూరుకి వెళ్లారు. ఇటీవల కొందరు వ్యక్తులు స్థానిక టీడీపీ నేత అండతో ఆ స్థలం మాది అంటూ కంచె వేశారు. దీంతో స్థానికులు అడ్డుకుని అసలైన లబ్ధిదారుకు తెలపటంతో ఆమె వచ్చి కంచె తొలగించారు. మా స్థలానికి మీకు పట్టా ఎవరు ఇచ్చారని ఆమె ప్రశ్నించగా, మీరు ఇల్లు కట్టుకోలేదని తహసీల్దార్ మాకు పట్టాయిచ్చారని చెప్పడం తో వారిమధ్య వాగ్వివాదం జరి గింది. ఇప్పటికైనా రెవెన్యూ అధి కారులు స్పందించి పలు కాలనీ ల్లోని రోడ్లు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను తొలగించటంతో పాటు నకిలీ పట్టాల సృష్టి కర్తలు, కబ్జాదారుల పై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతు న్నారు.


అట్లల ఫ్యాక్టరీ సమీపంలో ఇటీవల ఆక్రమణకు గురైన స్థలంలో కంచె తొలగిస్తున్న స్థానికులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం) : 6.20
సహరి (మంగళవారం) : 5.04

ఏగ్రేడు ధాన్యం పుట్టి రూ.19,720

- మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయం
- అందుబాటులో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- వీపీఏల వద్ద రైతులు కూపన్లు పొందాలి
- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి



నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరికోతలు ప్రారంభమయ్యాయని, రైతులకు కనీస మద్దతు ధర అందించేం దుకు పౌరసరఫరాలశాఖ జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని జిల్లా వ్యవ సాయాధికారి పీ.సత్యవాణి ఆది వారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. జిల్లాలో దాదాపు 3.57లక్షల ఎక రాల్లో వరి సాగు అయిందని, సుమారు 11లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ప్రభు త్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల మేరకు పుట్టి ఏగ్రేడు ధాన్యానికి రూ.19,720ల మద్దతు ధర అంది స్తామని తెలిపారు. ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించుకున్న రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకునేందుకు సమీ పంలోని రైతు సేవా కేంద్రాల్లోని వీపీ ఏలను సంప్రదించాలని ఆమె సూచిం చారు. కోతకు సిద్ధం గా ఉన్న పొలాల రైతులు కూడా వీపీఏల ద్వారా షెడ్యూల్ జనరేట్ చేయించుకుని కూపన్లు పొందాలని పేర్కొన్నారు. రైతుల మొబైల్ నెంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా ఈ కూపను పంపుతా మని తెలిపారు. ఈ కూపనుకు వారం గడువు ఉంటుందని, ఆ సమయంలోనే ధాన్యం కొనుగోలు ఉంటుందని తెలియ చేశారు. ఒకవేళ ఆలస్యమైతే మరోసారి రీషెడ్యూల్ చేయిం చుకునే అవకాశం ఉందని ఆమె వివరిం చారు. రైతులకు బహిరంగ మార్కెట్‌లో ధాన్యానికి మంచి రేటుకు లభిస్తే అమ్ముకోవచ్చని, వారి వివరాలను కూడా యాప్‌లో పొందుపరుస్తామన్నారు.

ఈ-క్రాఫ్ నమోదుకు నేటితో ముగింపు

రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథ కాలు అందాలంటే అవసరమైన ఈ-క్రాఫ్ నమోదు సోమవారంతో ముగియనుంది. ఈ-క్రాఫ్ నమోదు చేసుకుని ఈకేవైసీ చేయించుకోకపోయినా, పథకాలు దూరమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికీ చేయించుకోని రైతులు రైతు సేవా కేంద్రాల్లోని వీపీఏలను సంప్రదించి, తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పీ. సత్యవాణి సూచించారు. కాగా జిల్లాలో సుమా రుగా 98శాతం ఈ-క్రాఫ్ నమోదు పూర్తయింది. దాదాపు 3.44లక్షల ఎక రాలకుగానూ 3.36లక్షల ఎకరాలకు ఈ-క్రాఫ్ నమో దైంది. ఈకేవైసీ కూడా 90శాతం పూర్తయింది. రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల ఈ-క్రాఫ్, ఈకే వైసీలో కొంత జాప్యం జరిగింది. నూరుశాతం నమోదుకు కృషి చేస్తున్నామని ఆమె వివ రించారు. సెలవు రోజుల్లోనూ క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారని, రైతులు కూడా బాధ్యతగా ఈ-క్రాఫ్, ఈకేవైసీ చేయించుకునేందుకు ముందుకు రావాలని ఆమె తెలిపారు.

ఆశాలకు ప్రభుత్వం వరాల జల్లు
క్షేత్రస్థాయిలో మిశ్రమ స్పందన
డిమాండ్లన్నీ పరిష్కరించాలి : యూనియన్ డిమాండ్

ఫలించిన పోరు!

నెల్లూరు (వైద్యం) మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారికి ప్రసూతి సెలవుల్లో వేతనాలతోపాటు, పదవీ విరమణ వయసు 62 ఏళ్లగా నిర్ధారిం చింది. అలాగే పదవీ విరమణ తర్వాత గ్రాట్యుటీ ఇచ్చేందుకు కూడా అంగీకరించింది. దీంతో జిల్లాలోని 1811 మంది ఆశాకార్యకర్తలకు ప్రయోజనం చేకూరనున్నది. అయితే పూర్తి డిమాండ్లు పరిష్కరించాలని ఆశా కార్యకర్తల యూనియన్ డిమాండ్ చేస్తున్నది.

● హామీ నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు శనివారం ప్రకటించారు. ఇదిలా ఉండగా జిల్లాలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తల్లో మాత్రం మిశ్రమ స్పందన కనిపిస్తు న్నది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయా లను వారు స్వాగతిస్తూనే.. పూర్తి స్థాయిలో తమ డిమాండ్లు పరిష్కరించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలోనే ఆశా కార్యకర్తలకు ఎంతో ప్రాధాన్యమిచ్చారు. ఏఎన్ఎంల నియామకాల్లో అర్హతను బట్టి ఆశాలకు గుర్తింపు నిచ్చారు. అలాగే రేషన్‌కార్డుతోపాటు ఎన్టీఆర్ వైద్య సేవాపథకం వర్తింప చేసేటట్లు కృషి చేశారు. తాజాగా ఉద్యోగ విరమణ తర్వాత వృద్ధాప్య పింఛను అందించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. వీరికి వేతనాల కింద కేంద్ర ప్రభుత్వం రూ. 7వేలు ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 3వేలు కలిపి రూ. 10వేల జీతం చెల్లిస్తున్నది. ప్రస్తుతం ఏఎన్ఎంలతో సమానంగా 20కిపైగా వైద్య పథకాలను ఆశా కార్యకర్తలు అమలు చేస్తున్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం గత ఐదేళ్లలో వారు అనేక పోరాటాలు చేశారు. అయినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు.సీఎం చంద్రబాబు నిర్ణయంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్లు ఇవే...

- కనీస వేతనం చెల్లించాలి
- ఆశాకార్యకర్తలను కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లగా గుర్తించాలి.
- ఏఎన్ఎం శిక్షణ పొందిన వారికి పర్మినెంట్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత కల్పించాలి
- దశలవారీగా ఆశాలకు ఏఎన్ఎం శిక్షణ ఇవ్వాలి
- ఉద్యోగ భద్రత కల్పించాలి
- అనారోగ్యానికి గురయిన ఆశాలకు సెలవులివ్వాలి
- గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశాలు(ఫైల్)

వైద్య పథకాలపై శిక్షణేదీ ?



ఆశాకార్యకర్తలు ఎన్నో వైద్య పథకాలను అమ లు చేస్తున్నారు. అయితే ఆ పథకాలను క్షేత్రస్థా యిలో అమలు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారేకానీ, వాటిపై మాత్రం శిక్షణ ఇవ్వడం లేదు. వెంటనే శిక్షణ ఇవ్వాలి. ఆశాలు ఎవరైనా చనిపోతే మట్టి ఖర్చుల కింద ప్రభుత్వం కొంత మొత్తం అందించాలి. అనారోగ్యంతో సెలవు పెట్టాలంటే ఐదుగురు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. దీన్ని నుంచి విముక్తి కలిగించాలి. తమ డిమాండ్లు అన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించాలి.

- మధుసూదన, యూనియన్ జిల్లా కోశాధికారి

పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరించాలి



ఆశాలు ఎదుర్కొంటున్న సమస్య లను ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిష్కరించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు కొన్ని వరాలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం. ఇంకా సమస్యలు చాలా వరకు పెండిం గ్‌లోనే ఉన్నాయి. వాటిని కూడా పరి ష్కరించాల్సి ఉంది.

- దుగ్గిరాల అన్నపూర్ణమ్మ
ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

8న కావలిలో మెగా లోక్‌అదాలత్

అల్లూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : ఈనెల 8న కావలిలో నిర్వహించనున్న మెగా లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని లోక్‌అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోర్టుకు రాని కేసులు, పెండింగ్ కేసులు, ఖర్చులు భరించలేని వారు అప్పీల్ లేని అంతిమ తీర్పులకు ఈ లోక్‌అదాలత్ మంచి అవకాశమని పేర్కొన్నారు. కావలి న్యాయస్థానాల న్యాయమూర్తుల ఆధ్వర్యంలో జరిగే ఈ లోక్‌అదాలత్ సత్వర న్యాయం కోసం ఏర్పాటు చేస్తున్నారని, దీనిని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

కావలిటౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : రోటరి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం దంతం వారి వీధిలోని సాయిబాబ మందిర ప్రాంగణంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సుశీల నేత్రాలయ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి సుధాకర్‌రావు పర్యవేక్షణలో వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. 50మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. శస్త్ర చికిత్సల నిమిత్తం 20 మందిని నెల్లూరు ఆసుపత్రికి తరలించారు వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని రోటరి క్లబ్ అధ్యక్ష కార్యదర్శి స్వర్ణలత, సలీం బేగ్‌లు తెలిపారు. ఆలయం తరుపున పూర్తి సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో టంగుటూరి ప్రసాద్, రమేష్ నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాళ్ల దాడిపై చర్యలు తీసుకోవాలి

అల్లూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : భీమ్ ఆర్మీ పార్టీ అధినేత, నాగిన నియోజకవర్గం ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ వాహనంపై రాళ్లతో దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీగా వ్యవహరించే దళిత నాయకుడికే రక్షణ లేకుండా పోయిందని, ఇక సామాన్య దళితుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో తెలుస్తోందని పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్‌పై దాడికి పాల్పడిన వారిని ఆయన అనుచరులు పట్టుకొని పోలీసులకు అప్పగించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నూతన మోటారు వాహన చట్టాలపై అవగాహన



గ్రామస్థులకు చట్టాలను వివరిస్తున్న ఎస్సై భోజ్యా

బిట్రగుంట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నూతన మోటారు వాహన చట్టా లపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్సై భోజ్యా అన్నా రు. బోగోలు బజారు కూడలిలో ఆదివారం ఆయన వాహన చోదకులకు నూతన చట్టాలను వివరించారు. చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని, నిబంధనలు పాటిస్తూ ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక వ్యాపారులు, వాహనదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడుగడుగునా

స్పీడ్ బ్రేకర్లు!

● నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు ● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

● ఇబ్బందుల్లో వాహనచోదకులు, ప్రజలు



ఆర్వోబీ సర్వీస్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా వేసిన స్పీడ్ బ్రేకర్

కావలి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ ప్రజలు తమ ఇళ్లు, దుకాణాల ముందు నిబంధనలకు విరుద్ధంగా ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారు. పట్టణంలో ఏ వీధిలో అడుగుపెట్టినా స్పీడ్ బ్రేకర్ లేని రోడ్డే లేదంటే అతిశయోక్తి కాదు. ఎక్కడైనా పాఠశాలలు, ఆసుపత్రులు తదితర రద్దీ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు అవసరమనుకుంటే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లితే వారు వేస్తారు. లేదంటే వారి పర్యవేక్షణలో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రజలు వేసుకోవాలి. కానీ కావలిలో మున్సిపాల్టీ అనుమతులు లేకుండా రోడ్లన్నీ వారి సొంత జాగీర్‌లాగా ఎవరిష్టానుసారం వారు ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. ఈ స్పీడ్ బ్రేకర్ల వలన వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు ఎత్తుగా వేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి అనవసరమైన చోట ఉన్న స్పీడ్ బ్రేకర్లను తొలగించి అవసరమైన చోట ప్రమాదాలకు అవకాశాలు లేకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరం గ్రామం నుంచి పరకొండపాడు వెళ్లేదారిలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేస్తున్నందున సోమవారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. మాచవరం ఎస్సీ కాలనీ, రెడ్డిపాలెంలకు సరఫరా నిలిచిపోతుందని, ఈ లైనులో వ్యవసాయ విద్యుత్ సరఫరా కూడా అతర్వాత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి : ఏఈ

వలేటివారిపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : గృహ వినియోగదారులకు విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పిస్తున్న 50 శాతం సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ తాటికొండ మధుబాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో ఒక్కో కిలోవాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు రూ. 2 వేలు అని, ఇప్పుడు 50 శాతం రాయితీపై వెయ్యి రూపాయలు మాత్రమే అని తెలిపారు. ఈ అవకాశం జూన్ 30వ తేదీ వరకూ ఉందని గృహ వినియోగదా రులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈ కోరారు.

శ్రీకాళహస్తీశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో కావలి చిన్నారుల ప్రతిభ



శ్రీకాళహస్తి ఆలయ ఈవో రాజశేఖర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న చిన్నారులు

కావలిటౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వర ఆలయ బ్రహ్మో త్సవాల్లో నాట్య గురువు జాహ్నవి స్థాపించిన కావలి జయం కూచిపూడి నాట్యాలయ చిన్నారులు శనివారం రాత్రి కూచిపూడి నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. నాట్యాలయ చిన్నారులు ఆరాధ్య, మేఘశ్రీ, ఆకాంక్ష, నిఖిత, నిర్మయి, మధుప్రియ, మనస్వినిప్రియ, సమన్విత, ప్రణవి భావిక్,పావని, మౌనిక, తేజస్వి, భవానిలు ఉత్తమ ప్రదర్శన అందించి ప్రతిభ చాటడంతో ఆలయ ఈవో రాజశేఖర్ ప్రశంసా పత్రాలు, మెమొంటోలతో సత్కరించారు. నాట్యాలయం నిర్వాహకురాలు జమున పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నతి : ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి

కావలిటౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : ఇష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నతస్థానానికి చేరవచ్చని ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం బృందావనం కల్యాణ మండపంలో శ్రీచైతన్య డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డైరెక్టర్ జానకిరామ్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని క్రీడల్లో విజేతలకు, ర్యాకర్లకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బెజవాడ రవికుమార్, నందనవనం మధుసూధన్‌రావు, కొండయ్య, తిరివీధి ప్రసాద్, మస్తాన్ పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు పూర్తి చేసి, మట్టిని పూడుస్తున్న ఎక్స్‌కవేటర్

లింగసముద్రం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రం నుంచి వాకమళ్లవారిపాలెంకు వెళ్లే మంచినీటి పైపులైన్‌కు రాళ్లపాడు- రోళ్లపాడు మంచినీటి పథకం నిర్వాహకులు మరమ్మతులు చేశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో వర్షం నీరు కాదండోయ్- మంచినీరే శీర్షికతో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. ఆదివారం ఉదయం మంచినీటి పథకం నిర్వాహకులు గాలంకి ప్రసాద్, సిబ్బంది పైపునకు మరమ్మతులు చేసి మంచినీటి లీకేజీని అరికట్టారు. అయితే ఐదు రోజుల నుంచి మంచినీరు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రవహించడంతో రోడ్డు దెబ్బతింది. ఎట్టకేలకు మరమ్మతులు పూర్తి చేశారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలి



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ఉదయగిరి రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామ మసీదు వీధిలో విద్యుత్ స్తంభం నేలకొరిగి నెలలు గడుస్తున్నప్పటికీ పట్టించుకునే నాథులే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది జూన్‌లో కురిసిన వర్షాలకు కూలిపోయిన ఆ స్తంభం ఇప్పటికీ రహదారిపైనే వెక్కిరిస్తూ అలాగే పడి ఉంది. అప్పటి నుంచి ఆ వీధిలో అంధకారం నెలకొన్నప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు రాత్రి సమయాల్లో బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. శివారు ప్రాంతం కావడంతో కంపచెట్లు, అపరిశుభ్రత నడుమ విషపురుగుల తాకిడితో ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో దాతలు బచ్చు కృష్ణకుమార్, సంధ్య దంపతులు

బిట్రగుంట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ అక్కరాజువారి కండ్రిగలో నిర్మించ నున్న రామాలయానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రవాస భారతీయులు బచ్చు కృష్ణ కుమార్, సంధ్య దంపతులు అమరాబచ్చు ట్రస్ట్ నిధులతో ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తున్నారు. నూతన ఆలయ నిర్మాణ ప్రాంగణంలో సీతారాముల చిత్ర పటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం, ప్రసా దాల పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో రాధాకృష్ణ, మాజీ చైర్మన్ శ్రీరామ్‌మాల్యాద్రి, విశ్రాంత ఇంజినీరు గోపికృష్ణ, వైద్యులు ఆనందసాగర్, సాయిసేవకులు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు చర్యలు

● ఖుద్దూస్‌బాషా, ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఏఈ



ఉదయగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మండల ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్‌బాషా పేర్కొన్నారు. వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు.

? మండలంలో లోఓల్టేజీ సమస్య ఉందా.

! మండలంలో లోఓల్టేజీ సమస్య నివారించేందుకు ఇటీవల ఎనిమిది నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశాం. ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం.

? వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నారా.

! వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సకాలంలో మంజూరు చేయిస్తున్నాం. గతంలో కొంత సామగ్రి కొరత ఉండేది. ప్రస్తుతం ఆ సమస్య లేదు.

? శిథిలావస్థకు చేరిన స్తంభాలను మారుస్తున్నారా.

! మండలంలో శిథిలావస్థకు చేరిన స్తంభాల స్థానంలో నూతన స్తంభాలను ఏర్పాటు చేస్తున్నాం.

ఆధ్యాత్మికతకు ధ్యానం దోహదం

వింజమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ధ్యానం ఆధ్యాత్మిక ఎదుగుదలకు దోహదపడుతుందని నెల్లూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ శివ అలహరి అన్నారు. వింజమూరులోని శ్రీవేద వ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శాకాహారం గొప్పతనాన్ని వివరిస్తూ కరపత్రాలు పంచుతూ పిరమిడ్ నగర్ సీతారామతోట, వైశ్యబజార్ వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు.

పిచ్చిమొక్కలతో నిండిన సంగం - కలిగిరి రోడ్డు మార్జిన్

● ప్రమాదాల బారిన వాహనచోదకులు

● పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



రహదారి మార్జిన్ కనిపించకుండా ఏపుగా పెరిగిన మొక్కలు

సంగ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగం - కలిగిరి రహదారి మార్జిన్ పిచ్చి మొక్కలతో నిండిపోయి ప్రమాదాలకు నిలయంగా మారిందని వాహన చోదకులు ఆవేదనన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏకవరుస రహదారిగా ఉన్న సంగం - కలిగిరి రహదారిని తొమ్మిదేళ్ల కిందట రెండు వరుసల తారు రోడ్డుగా మార్చారు. సంగం చెక్‌పోస్టు నుంచి హసనాపురం వరకు రహదారిని అభివృద్ధి చేశారు. దీంతో ప్రయాణికులతోపాటు వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు. రెండు వరుసల రహదారిగా మార్చడంతో వాహన రాకపోకలు పెరిగి ఇటీవల రద్దీగా మారింది. నిత్యం పామూరు - నెల్లూరు, ఏయస్‌పేట - నెల్లూరుకు తిరిగే ఆర్టీసీ బస్సులతోపాటు కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో నిత్యం మరింత రద్దీగా మారిపోయింది.

రోడ్డుమార్జిన్ కనిపించక ప్రమాదాలు

రహదారికి రెండు వైపుల ఏర్పాటుచేసిన మార్జిన్ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ పిచ్చి మొక్కలతో సుమారు ఐదడుగుల ఉన్న మార్జిన్ కనిపించడంలేదు. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సార్లు ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంగం- హసనాపురం మధ్య ఇలాంటి ఘటనలు తరుచుగా జరుగుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు. రెండు వరుసల రహదారి కావడంతో కార్లు, ఆటోలు, వాహనదారులు వేగంగా నడుపుతున్నారు. ఈక్రమంలో మార్జిన్ లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్‌లో పిచ్చిమొక్కలు తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఎస్‌బీఐ ఖాతాదారులకు సువర్ణావకాశం



మాట్లాడుతున్న మేనేజర్ మహమ్మద్ మున్వర్

ఆత్మకూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): భారతీయ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా ప్రవేశపెట్టిన ప్రమాద బీమా ఖాతాదారులకు సువర్ణావకాశం అని స్థానిక బ్యాంక్ మేనేజర్ మహమ్మద్ మున్వర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఆత్మకూరులో విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఉన్న ప్రమాద బీమా పథకాన్ని రెట్టింపు చేస్తూ నూతన పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకంలో ఖాతాదారుడు ఏడాదికి రూ. 2వేలు ప్రీమియం చెల్లిస్తే ఏడాది పాటు ఈ పాలసీ వర్తిస్తుందని తెలిపారు. ఈ ఏడాది కాలంలో ఖాతాదారుడికి ప్రమాదవశాత్తు మరణం సంభవించిన లేదా పూర్తిస్థాయి అంగవైకల్యం ఏర్పడినా పాలసీదారుని కుటుంబానికి రూ. 40 లక్షలు ఇన్సురెన్స్ రూపంలో నగదు చెల్లిస్తారని తెలిపారు. వీటితోపాటు పాలసీ పొందినవారు ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో అంబులెన్స్ లేదా ప్రైవేటు వాహనాన్ని ఉపయోగించినా వాటి ఖర్చులు, పాలసీదారుడు మరణించిన సమయంలో వారి కర్మకాండ ఖర్చులకు నగదు చెల్లిస్తారన్నారు. ఈ సువర్ణవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

వింజమూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్రబల్లిపాలెంలో ఆదివారం ఏకశిలా ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి

అనంతసాగరం మార్చి2(ఆంధ్రజ్యోతి): పరీక్షలకు సమయం ఆసన్నమైంది... శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని అనంతసాగరం ఎంఈవో-2 కే ప్రభాకర్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులకు సూచించిరు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారం మండలంలోని సోమశిల, అనంతసాగరం, కొత్తపల్లి, రేవూరు, వెంగంపల్లి, కామిరెడ్డిపాడు, చిలకలమర్రి ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

కాటేపల్లి ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజలు

వింజమూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాటేపల్లి ఉన్నత పాఠశాలలో త్వరలో జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ లక్ష్మీరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ గంగాభవానీ, గంగరాజు, ఉపాధ్యాయులు సరళ, యు.శ్రీనివాసులు, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

● మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



ఉపవాసదీక్ష విరమణ అనంతరం ఇఫ్తార్ విందు చేస్తున్న ముస్లింలు

ఉదయగిరి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ఉపవాస దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. దీక్షబూనిన ముస్లింలు ఉదయం 4.30 గంటల్లోపు సహర్ పేరుతో ఆహారాన్ని స్వీకరించారు. అనంతరం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటల తరువాత ఇఫ్తార్ విందు చేసి ఉపవాస దీక్షను విరమించారు. నెలరోజులపాటు ముస్లింలు ఈ ఉపవాస దీక్షలు చేయనుండడంతో మసీదు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

హైలెవెల్ కెనాల్ పనులు ప్రారంభించాలి

● అఖిలపక్ష నేతల డిమాండ్



మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య

మర్రిపాడు, మార్చి 2 (ఆంధ్యజ్యోతి): ఆనం సంజీవ రెడ్డి హై లెవెల్ కెనాల్ పను లను తిరిగి చేపట్టాలని, అందు కు బడ్జెట్‌లో నిధులు కేటాయిం చాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం రైతులతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లా డుతూ గత టీడీపీ ప్రభుత్వంలో 2014లో ప్రారంభించి నేటికి 69శాతం మాత్రమే పనులు పూర్తి చేశారని, ప్రభుత్వాలు శ్రద్ధ పెడితే ఏడాది కాలంలో పూర్తి చేయవచ్చని అన్నారు. పనులు పూర్తయితే ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం, ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు మండలాలల్లో సుమారు 90వేల ఎకరాలకు సాగు నీరు, 2.50లక్షల జనాభాకు తాగునీరు అందుతుందని అన్నారు. గత ప్రభుత్వంలో సోమశిల డ్యామ్ వద్ద అప్రాన్ దెబ్బతిందని అప్పటి ఎమ్మెల్యేని పలుమార్లు కలిసి విన్నవించుకుంటే చేస్తానని చెప్పి కాలం వెల్లబుచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి వెంగయ్య, రాజగోపాల్, శ్రీరాములు, వైసీపి మండల కన్వీనర్ వెంకటేశ్వరెడ్డి, శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ఉదయగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి అనూష ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ టీకాలను నాలుగు నెలలు దాటిన దూడలు, గేదెలు, ఆవులకు ఈనెల 31వ తేదీ వరకు టీకాలు వేయడం జరుగుతుందని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

● సీతారామపురం : పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి వి అనూష ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి మార్చి 30వ తేదీ వరకు స్థానిక పశువైద్యశాల పరిధిలోని అన్ని పశువులకు టీకాలు వేయించుకోవాలని తెలిపారు.

శరవేగంగా లింకురోడ్ల నిర్మాణ పనులు



167బీ జాతీయ రహదారి నుంచి జరుగుతున్న పలుకూరు రోడ్డు నిర్మాణం

కందుకూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో మంజూరైన లింకురోడ్ల నిర్మాణ పనులు శర వేగంగా సాగుతున్నాయి. రూ. 11.5 కోట్ల అంచనా వ్యయంతో పలు గ్రామాల మధ్య లింకురోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరుకాగా గత నెలలో పనులు ప్రారంభమయ్యాయి. కందుకూరు మండలంలో 167బీ జాతీయ రహదారి నుంచి పలుకూరు గ్రామానికి, ఇదే జాతీయ రహదారి నుంచి మహదేవపురం గ్రామానికి లింకురోడ్లను బీటీరోడ్లుగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు కాగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వలేటివారిపాలెం మండలంలో కళవళ్ల నుంచి వీఆర్ కోటకు, శింగమనేనిపల్లి నుంచి పోకూరు, 167బీ జాతీయ రహదారి నుంచి కొండసముద్రం, రోళ్లపాడు గ్రామాలకు లింకురోడ్లు మంజూరు కాగా పనులన్నీ వేగవంతంగా జరుగుతున్నాయి. శింగమనేనిపల్లి - పోకూరు రోడ్డు జీఎస్‌పీ, వెట్‌మిక్స్ పనులు జరుగుతుండగా మరో పది, పదిహేనురోజుల్లో తారురోడ్డుగా అభివృద్ధి చేసేదిశగా పనులు సాగుతున్నాయి. కొండముడుసుపాలెంలో కేజీటీ రోడ్డు వయా ఎస్సీ కాలనీ రోడ్డు అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఉలవపాడు మండలంలో కుమ్మరిపాలెం - కొల్లూరుపాడు రోడ్డు పనులు వేగంగా సాగుతుండగా గుడ్లూరు మండలంలో పాజర్ల రోడ్డు పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.



అడవి కాదన్నా.. జగనన్న లేఅవుటే..!

ఈ చిత్రం చూసి చిట్టడవి అనుకునేరు... కాదన్నో... జగనన్న లేఅవుట్. దుత్తలూరు మండలం వెంకటంపేట గ్రామంలో పేదలకు గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇళ్ల స్థలాల లేఅవుట్. అక్కడ ప్రజాధనం వెచ్చించి రోడ్లు వేయించి నీటివసతి కల్పించారు. ఇంటి నివేశన స్థలాలు మంజూరైన లబ్ధిదారులు పలువురు బేస్‌మట్టాలు సైతం నిర్మించారు. ప్రస్తుతం ఆ ప్రాంతం కంపచెట్లతో ఏపుగా అడవిని తలపిస్తోంది.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

దీపం-2.. రాయితీ రాలేదు!

కొందరికి జమ కాని 'గ్యాస్' నగదు

సాంకేతిక కారణాలతోనే...

మొదటి సిలిండర్ బుకింగ్‌కు ఈ నెలాఖరు వరకు అవకాశం



నెల్లూరు (హరనాథపురం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇచ్చే దీపం-2 పథకానికి సాంకేతిక సమస్యలు ఎదురవుతు న్నాయి. గతేడాది నవంబరులో ఈ పథకాన్ని ప్రారంభించారు. అర్హులైన వినియో గదా రులు గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుని నగదు చెల్లించి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ మొత్తం లో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ మినహాయించి మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం సదరు వినియోగదారుని బ్యాంకు ఖాతాకు జమ చేస్తుంది. ఈ విధంగా ఇప్పటికే సిలిండర్ బుక్ చేసుకున్న చాలా మందికి సిలిండర్ అందిన వారం రోజుల్లోనే బ్యాంకు ఖాతాకు నగదు జమ అయింది. అయితే పలువురు వినియోగదారుల ఖాతాల్లో మాత్రం నగదు జమ కాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబరు 1967ను అందుబాటులోకి తెచ్చింది. కానీ, ఆ నెంబర్‌కి ఫోన్ చేస్తే సమాధానం ఉండడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

నగదు జమ కాకపోవడానికి కారణాలు ఇవే..

- లబ్ధిదారునికి రెండు, మూడు బ్యాంకు ఖాతాలు ఉండడం, బ్యాంకు ఖాతాలో ఆధార్ సంఖ్య అనుసంధానం కాకపోవడం, గ్యాస్ కనెక్షన్‌కు ఇచ్చిన ఖాతా నెంబర్‌తో లబ్ధిదారుని ఈకేవైసీ పూర్తి కాకపోవడం.
- గ్యాస్ కనెక్షన్ ఒకరి పేరుతో ఉండగా మరొకరు వినియోగిస్తుంటే కనెక్షన్ ఉన్న వారికే నగదు జమ అవుతుంది.
- లబ్ధిదారులకు బ్యాంకు ఖాతా మనుగడలో లేకుండా పోవడం.
- గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా రేషన్‌కార్డులు ఇచ్చేశారు. ఇప్పు డు ఆ కార్డులపై ఆరంచెల తనిఖీ చేపట్టగా కొందరిని అనర్హులుగా గుర్తించారు. ఇలాంటి వారికి గ్యాస్ నగదు జమ కావడం లేదు.
- గ్యాస్ రాయితీ జమకాని వారి సంఖ్య పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటోంది. 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు ఉందని, ఆరు నెలలకు విద్యుత్ వినియోగం 1800 యూనిట్లు దాటిందని, నాలుగు చక్రాల వాహనం ఉందని, గ్యాస్ కనెక్షన్‌తో ఆధార్ సంఖ్య అనుసంధానం కాలేదని... వంటి కారణాలతో నగదు జమకాని వారు డీఎస్‌వో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

4.30లక్షల మందికి లబ్ధి..

దీపం-2 పథకానికి జిల్లా లో 4,30,047 మంది అర్హులని అంచనా. ఇప్పటికే 4,25,524 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. వీరి ఖాతాల్లో రూ.33.75కోట్లు జమ అయింది. కాగా, మొదటి ఉచిత సిలిండర్ బుకింగ్‌కు ఈ నెలాఖరు వరకు అవకాశం ఉందని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే.

అలరించిన 'మిస్ నెల్లూరు' పోటీలు

● మురిపించిన మగువలు ● వైభవంగా గ్రాండ్ ఫినాలే



గ్రాండ్ ఫినాలేలో మిస్ నెల్లూరు-2025 టైటిల్ కోసం పోటీపడుతున్న మగువలు



పోటీలు తిలకిస్తున్న న్యాయనిర్ణేతలు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మిస్ నెల్లూరు-2025 ఎంపికకు నిర్వహించిన పోటీల్లో మగువలు తమ అందాల ప్రదర్శనలతో ప్రేక్షకులను మురిపించారు. ఆదివారం రాత్రి మాగుంట లేఅవుట్‌లోని ఓ ఫంక్షన్ హాలులో మిస్ నెల్లూరు-2025 గ్రాండ్ ఫినాలే జరిగింది. గత నెలలో ఈ పోటీలకు ఆడిషన్స్ నిర్వహించి 30 మందిని ఎంపిక చేశారు. వీరికి పలు రకాల శిక్షణ ఇచ్చి గ్రాండ్ ఫినాలేలో పాల్గొనేందుకు 20 మందిని ఎంపిక చేశారు. వీరికి పోటీలు నిర్వహించి విజేతలకు మిస్ నెల్లూరు 2025 టైటిల్ ఇచ్చారు. టైటిల్ సాధించేందుకు మగువలు పోటీపడ్డారు. కార్యక్రమానికి 25 కళా సంఘాల అసోసియేన్ నిర్వాహకులు సహకరించారు. ఈ కార్యక్రమం బ్లాసం బ్లూ ఈవెంట్స్ సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో 25 కళా సంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్ పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా సతీష్ అడ్డాల, మిస్ ఆంధ్ర విన్నర్ యాస్మిన్, నెల్లూరు శ్రీమతి తదితరులు వ్యవహరించారు.

రాజ్యాధికారంతోనే వడ్డెర్ల అభివృద్ధి

వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవెళ్ల మురళి



మాట్లాడుతున్న వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవెళ్ల మురళి

కావలిటౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : రాజ్యాధికారంతోనే వడ్డెర్ల అభివృద్ధి సాధ్యమని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవెళ్ల మురళి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఏఎన్ఆర్ కల్యాణమండపంలో జరిగిన నియోజకవర్గ వడ్డెర్ల సంఘం ఎన్నికల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికైన సంఘ సభ్యులకు నియామక పత్రాలు అందజేసి శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో వడ్డెర్ల ప్రాతినిధ్యం లేకపోవడంతో వడ్డెర్ల సమస్యలు మరుగునపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెర కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. అనేక రాష్ట్రాల్లో వడ్డెర్లను ఎస్టీలుగా పరిగణిస్తున్నారని, మన రాష్ట్రంలో కూడా వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేవిధంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రప్రభుత్వానికి పంపాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ గుంజి నరేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివా స్, ఓసీసీఐ నేషనల్ చీఫ్ అడ్వయిజర్ గుం జి నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి రమణయ్య, వడ్డెర మహిళా సంక్షేమ సం ఘం రాష్ట్ర అధ్యక్షురాలు రామతులసి పాల్గొన్నారు.

● **నూతన కమిటీ**

గౌరవాధ్యక్షుడిగా పల్లపు చిట్టిబాబు, సలహాదారుడిగా తన్నీరు బాబు, అధ్యక్షుడిగా మల్లె సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడిగా పల్లపు కొండలరావు. ప్రధాన కార్యదర్శిగా తన్నీరు మాల్యాద్రి, తదితరులు ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుంజులూరుపాడు రైల్వే గేటు వద్ద కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. గూడూరు రూరల్ మండలం చెన్నూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు మోటర్ బైక్‌పై పోర్టుకు వెళ్లి తిరిగి వస్తుండగా పుంజులూరుపాడు రైల్వే గేటు దాటిన తర్వాత పోర్టు రోడ్డుపై గేదేలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఓ ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యకు యత్నించి వైద్యశాలలో చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని సంతపేటలో సత్యనారాయణ (60), సుజాత దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. ఒక కుమార్తె అమెరికాలో ఉండగా మరో కుమార్తె నెల్లూరులోనే ఉంటోంది. సత్యనారాయణ గతంలో కుదవ వ్యాపారం చేసేవాడు. రెండేళ్లుగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అప్పుడప్పుడు ఇంటికి వచ్చి భార్యకు కనిపించి వెళ్లేవాడు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీ ఆయన సంతపేట సమీపంలో పురుగుల మందు తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు తిరుపతి రూయా వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు సంతపేట ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేశారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

● రూ.5 లక్షల నష్టం



బ్యారన్‌లో కాలిపోయిన పొగాకు

కలిగిరి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుదమలదిన్నెపాడు గ్రామంలో పొగాకు రైతు పేట వెంకటేశ్వర్లుకు చెందిన పొగాకు బ్యారన్ ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. పొగాకును క్యూరింగ్ చేస్తుండగా ఆకు గొట్టాలపై పడటంతో మంటలు వ్యాపించి బ్యారన్‌లోని పొగాకు, అల్లుడు కర్రలు, టైర్లు, గొట్టాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. వింజమూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పొగాకు బోర్డు అధికారులు నష్టం వివరాలను నమోదు చేసుకున్నారు. ఈప్రమాదంలో దాదాపు రూ.5 లక్షల నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో సంతపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని గుప్తాపార్కు ప్రాంతానికి చెందిన సుప్రియ ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. ఈ క్రమంలో ఆదివారం ఆమె గాంధీబొమ్మ సెంటర్ వద్ద బయోడేటా తయారు చేసుకు వస్తానని కుటుంబ సభ్యులకు తెలిపి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించినా ప్రయోజనం లేకపోయింది. సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా పోలీసులకు యోగా, మ్యూజికల్ చైర్ పోటీలు

● కొనసాగుతున్న వారోత్సవాలు



మ్యూజికల్ చైర్ పోటీ నిర్వహిస్తున్న నగర డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారత్సోవాల్లో భాగంగా నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో యోగా, ధ్యానం, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య మాట్లాడుతూ యోగాతో ఒత్తిడిని జయించవచ్చని, ఆత్మస్థైర్యం నింపు తుందని చెప్పారు. ప్రతీ ఒక్కరు యోగాను జీవితంలో భాగం చేసు కోవాలని పిలుపునిచ్చారు. పోలీసులు బందోబస్తు విధుల్లో ఎక్కువ సేపు నిలుచుకోవడానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం మహిళా పోలీసులు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో యోగా గురువు, హెడ్‌కానిస్టేబుల్ మురళి ప్రాణాయామం, పలు యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. కార్య క్రమంలో నగర డీఎస్పీ సింధుప్రియ, మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



రంగనాథస్వామి బ్రహ్మోత్సవ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగూరు నారాయణ

9 నుంచి రంగడి బ్రహ్మోత్సవాలు

● గోడపత్రికల ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 2 (ఆంధ్ర జ్యోతి) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మో త్సవాల ఈ నెల 9వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. దీనికి సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రికలను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన కల్యాణ వేంకటేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా కల్యాణ వేంకటేశ్వరుడి రథోత్సవం

● వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం రామకృష్ణానగ్‌లో కొలువైవున్న కల్యాణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం వైభవంగా జరిగింది. రథంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడు బుచ్చి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితుల వేదమంత్రాలు, మంగళ మేళాలు, పలు రకాల వాయిద్యాలు, పండరి భజనలు, కోలాటాలు, స్వామివారి సంకీర్తనాలాపనలతో రథోత్సవం సాగింది. పోలీసు బందోబస్తు నడుమ వేలాదిగా తరలివచ్చిన భక్తుల హరనామ స్మరణలతో పట్టణం మార్మోగింది. ముందుగా ఆలయం నుంచి బయలుదేరిన రథోత్సవం శేఖర్‌రెడ్డి ఆసుపత్రి వద్ద చెన్నూరురోడ్డు మీదుగా బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి చెన్నూరురోడ్డులో మలిదేవి కాలువ కొత్త బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని అక్కడి నుంచి ఆలయానికి చేరుకోవడంతో రథోత్సవం ముగిసింది. ఈ సందర్భంగా పలువురు దాతలు భక్తులకు మంచినీరు, మజ్జిగ, కూల్‌డ్రింక్స్, పులిహోర, పెరుగన్నం, అన్నదాన కార్యక్రమాలు చేశారు. రథోత్సవానికి కేతరాజు కేశవరావు, గుబ్బా సూర్యనారాయణ, టంగుటూరి మల్లికార్జునరెడ్డి, కొంజేటి వెంకటశేషయ్య, రామిశెట్టి కళ్యాణ్, యారాశి మహేష్, కొలమడి హజరత్తయ్య, ఇనుగూరు శ్రీనివాసులు, అచ్యుత వెంకట సుబ్రమణ్యం కుటుంబాలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాత్రి స్వామివారు అశ్వవాహన సేవలో ఊరేగారు. ఈ కార్యక్రమానికి అన్నం శ్రీనివాసులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఘనంగా 'బ్లూమ్ ఫీల్డ్' లాంఛింగ్

● నిబద్ధత, నమ్మకం 'వర్చ్యూసా'కే సాధ్యం : ఎమ్మెల్యే సోమిరెడ్డి

● సినీహీరోయిన్‌లు, జబర్దస్త్ నటులతో సందడి



ఎమ్మెల్యే సోమిరెడ్డిని సన్మానిస్తున్న వర్చ్యూసా అధినేత వాయుగుండ్ల వెంకటేశ్వర్లు, సంస్థ ప్రతినిధులు

మనుబోలు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగితాలపూరు క్రాస్‌రోడ్డులో వేసిన వర్చ్యూసా కంపెనీ బ్లూమ్ ఫీల్డ్ లాంఛింగ్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వర్చ్యూసా అధినేత వాయగండ్ల వెంకటేశ్వర్లు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు జ్యోతి ప్రజల్వన చేశారు. అనంతరం ఎమ్మెల్యేను వర్చ్యూసా అధినేత, ప్రతినిధులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వర్లు నిబద్దత, నమ్మకం కలిగిన వ్యక్తి అన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో 25ఏళ్లుగా అనుభవం ఉందన్నారు. వర్చ్యూసా కంపెనీ ద్వారా ఇప్పటికే పలు నగరాల్లో పది వెంచర్లు వేశారన్నారు. సాధారణంగా వెంచర్లలో పది శాతం భూమిని పంచాయతీకి కేటాయించాలన్నారు. అయితే ఇతరులు వెంచర్లకు అనుమతి వచ్చే వరకు ఆ భూమిని చూపించి, తరువాత అమ్మేస్తుంటారన్నారు. కానీ వర్చ్యూసా దానికి భిన్నమైందన్నారు. భవిష్యత్తులో వర్చ్యూసా మరింతగా ఎదగాలని ఆకాక్షిస్తున్నానన్నారు.

సినీ, జబర్దస్త్ నటుల సందడి



కార్యక్రమానికి హాజరైన సినీ హీరోయిన్‌లు ఐశ్వర్యరాజేష్, నిధి అగర్వాల్, జబర్దస్త్ నటి వర్ష

వెంచర్ లాంఛింగ్ సమయంలో కస్టమర్లను ఉత్సాహపరిచేందుకు సినీ నటీమణులు ఐశ్వర్య రాజేష్, నిధి అగర్వాల్, జబర్దస్త్ నటులు రాజు, అప్పారావు, నవీన్, వర్ష, తదితరులు సందడి చేశారు. అలాగే గాయనీ, గాయకులు శ్రీకృష్ణ, సాహితి, గోవిందల గేయాలాపన అలపించింది. పలువురు డ్యాన్సర్లు వారి నృత్యంతో ఆకట్టుకున్నారు. సినీ, జబర్ధస్త్ నటులతో కస్టమర్లు, యువకులు సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. పలువురు ప్లాట్లు బుక్ చేయడంతో వారికి అదనంగా స్పిన్ పద్ధతిలో గిఫ్ట్ సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వర్చ్యూసా అధినేత మేనమామ సుబ్బయ్య, సీజీఎంలు, జీఎంలు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

సోమశిల నీటిమట్టం 58.603 టీఎంసీలు

అనంతసాగరం మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 5 క్యూసె క్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికా రులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 58.603 టీఎంసీలు ఉంది. డెల్టాకు 2,480, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

అడవిని తలపిస్తున్న శ్మశానవాటిక

● ఆక్రమణలతో మూసుకుపోయిన రహదారి ● అంత్యక్రియలకు అవస్థలు



ముళ్ల చెట్లతో నిండిపోయిన శ్మశానం

సీతారామపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం గ్రామ పంచాయతీలోని సబ్‌స్టేషన్ సమీపంలో గల శ్మశానవాటిక అడవిలా మారిందని, శ్మశాన వాటికకు వెళ్లే దారికి ఇరువైపులా ఆక్రమణకు గురై నలుగురు తీసుకెళ్లాల్సిన మృతదేహాన్ని ఒక్కరు మాత్రమే తీసుకెళ్లే దారి మాత్రమే ఉండడంతో ఎంతో కష్టంగా శ్మశాన వాటికకు తీసుకుపోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, కనీస వసతులు లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించడానికి అవస్థలు పడాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్ సమీపంలో సర్వే నెంబర్ 529-2లో హిందూ శ్మశాన వాటిక ఏర్పాటు చేశారు. తోటవీధి, కురవ వీధి, అల్లిక వీధి, వాడ వీధి, కొట వీధి, తోట కాలనీ, బెస్తకాలనీ, రజక కాలనీ తదితర ప్రాంతాలకు చెందినవారు ఎవరైనా మృతిచెందితే ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. శ్మశాన వాటిక, శ్మశానానికి వెళ్లే మార్గం ముళ్ల చెట్లతో నిండి ఉండడంతో దారి సౌకర్యం కూడా లేకుండా పోయిందని, అడవిని తలపిస్తుండడంతో మృతదేహా లను ఖననం చేయాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా శ్మశాన వాటిక కూడా ఆక్రమణకు గురవుతుందని, శ్మశాన వాటికకు హద్దులు చూపించమని పలుమార్లు తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానవాటికను అభివృద్ధి చేయడంతో పాటు ప్రహరీ నిర్మించాలని, వసతులు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కనుల పండువగా 'అలకలతోపు'

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి అలకలతోపు ఉత్సవం కనుల పండువగా జరిగింది. అర్చక స్వాములు మూలస్థానేశ్వర స్వామికి, భువనేశ్వరి అమ్మవారికి నిర్వహించిన ఈ ఉత్సవం భక్తు లను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం మహా న్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్ర హోమం, విశేష పూజలు జరిగాయి. అనంతరం తిరుచ్చి ఉత్సవం నిర్వహిం చారు. సాయంత్రం పూలంగి సేవ, కుంభహారతులు, అనంతరం అలుకల తోపు ఉత్సవం జరిగాయి. కార్యక్రమా లను ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు. కాగా, మూలాపేటలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలోనూ జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు, తిరుచ్చి, పేట ఉత్సవం జరిగాయి. రాత్రి అలకలతోపు వేడుక నిర్వహించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	116
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8178
వెండి కిలో ధర	రూ. 96,400
వెండి ఒక గ్రాము	రూ.99.40

ఘనంగా పుస్తకావిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : టౌనుహాలు వర్ధమాన సమాజంలో సుధా మురళి రచించిన తడి ఆరని వాక్య మొకటి కవితా సంకలనం ఆవిష్కరణ ఆదివారం ఘనంగా జరిగింది. ప్రముఖ రచయిత్రి విమల ఈ సంకలనాన్ని ఆవిష్కరించారు. ప్రసేన్, శ్రీరామ్ పుష్పాల, పణ మాధవి, కన్నాజీ, ముక్కాల చక్రధర్, సుంకర గోపాల్, సరసిజ పెనుగొండ, పాతూరి అన్నపూర్ణ, ఈతకోట సుబ్బారావు, పెరుగు రామకృష్ణ, అవ్వారు శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

పండ్ల బండ్లను ఢీకొన్న కారు

నెల్లూరు(క్రైం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు సమీపంలో ఓ కారు పండ్ల బండ్లను ఢీకొంది. సేకరించిన సమాచారం మేరకు... ఆదివారం సాయంత్రం ఓ కారు ఆర్టీసీ బస్టాండు నుంచి కేవీఆర్ పెట్రోలు బంకు సెంటర్ వైపు వేగంగా వస్తూ రోడ్డు మార్జిన్‌లో ఉన్న పండ్లు బండ్లను, వాటి పక్కనే ఉన్న ఓ స్కూటీను ఢీకొంది. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఏ ప్రమాదమూ జరగలేదు. ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని రాకపోకలకు అంతరాయం కలుగకుండా చూశారు. కాగా, తమకు నష్టం జరిగిందని పండ్లు బండ్ల నిర్వాహకులు ఆరోపించారు.

బడ్జెట్‌లో ఎస్సీలకు ప్రాధాన్యం

● మాతంగి కృష్ణ

నెల్లూరు (వైద్యం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన బడ్జెట్‌లో ఎస్సీల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చిందని టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ వెల్లడించారు. ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం లో ఎస్సీల సంక్షేమం కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు. కానీ, టీడీపీ కూటమి ప్రభుత్వం మాత్రం రూ.20వేల కోట్ల కుపైగా కేటాయించిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలతో ఎన్నో పేద కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుడు డేగా రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నాయి.

వివాహితను కాపాడిన పోలీసులు

నెల్లూరు(క్రైం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బిడ్డతోపాటు ఆత్మహత్యకు యత్నించిన వివాహితను పోలీసులు రక్షించారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని చింతారెడ్డి పాళెంలో నివసించే నితిన్, జాస్మిన్ ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఏడు నెలల పాప ఉంది. కుటుంబ కలహాల నేపథ్యంలో జాస్మిన్ పాపతో కలిసి శనివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. సౌత్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాల పక్కనే పాపతో ఉన్న వివాహితను అటుగా వెళుతున్న హరీష్ అనే వ్యక్తి గమనించి 112 నెంబరుకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు ప్రభుకిరణ్, పుల్లయ్య హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని తల్లీబిడ్డను సంరక్షించి స్టేషన్‌కు తరలించారు. కౌన్సెలింగ్ ఇచ్చి పోలీసు వాహనంలో రూరల్ పోలీసు స్టేషన్‌కు పంపారు. రూరల్ ఇన్‌స్పెక్టర్ వేణు వివాహిత భర్త, కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లీబిడ్డను అప్పగించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భగత్‌సింగ్ కాలనీ బడికి

ప్రహరీ, ఆట వస్తువులు

● 24 గంటల్లో మంత్రి నారాయణ హామీ అమలు

● రైల్వే బ్రిడ్జి నిర్వాసితులకు పట్టాల పంపిణీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలో భగత్‌సింగ్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి, ఆట వస్తువుల ఏర్పాటుకు మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలను తప్పనిసరిగా అమలు చేస్తామని, మే నెల నుంచి తల్లికి వందనం పథకం అమలవుతుందని చెప్పారు. నగరంలో పెన్నా నదిపై నూతన వంతెన నిర్మాణంతో నిర్వాసితులైన వారికి 2సెంట్ల చొప్పున భూమిని ఇచ్చారు. ఈ మేరకు మొదటి విడతగా 124 మందికి వెంకటేశ్వరపురంలో స్థలాలు కేటాయిస్తూ పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ సూర్యతేజ, ఇన్‌చార్జి ఆర్డీవో వంశీకృష్ణ, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, అనురాధ, స్థానిక కార్పొరేటర్ సాఫియా



భూమి పట్టాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ మంత్రి నారాయణ

ముజీర్, జహీర్, మునీర్, అన్వర్, జమీర్, తహసీల్దారు షఫీ మాలిక్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రి నారాయణ శనివారం సామాజిక పింఛన్ల పంపిణీకి భగత్‌సింగ్ కాలనీలో పర్యటించారు. ఆ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఆ బడికి ప్రహరీ, పిల్లలకు ఆట వస్తువులు లేకపోవడంతో వెంటనే వాటన్నింటినీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన హామీ ఇచ్చిన 24 గంటల గడవక ముందే ఆట వస్తువులు అన్నీ పాఠశాలకు చేరుకున్నాయి. వాటిని అమర్చేందుకు, ప్రహరీ గోడ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన కూడా చేయడంతో స్థానిక ప్రజలు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

న్యూస్ బాక్స్

6న రాజరాజేశ్వరికి పుష్పయాగం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి ఈ నెల 6వ తేదీన పుష్పయాగం జరగనుంది. ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన దినోత్సవం సందర్భంగా పుష్పయాగం నిర్వహిస్తున్నారని, భక్తులందరూ తరలిరావాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన కార్యాలయంలో పుష్పయాగం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

9న కాత్యాయనీ వత్రం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈనెల 9న కాత్యాయనీ వ్రతం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకుడు లలితా శివకుమార్ స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9గంటల నుంచి జరిగే ఈ వ్రతంలో పాల్గొనదలచిన భక్తులు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

వెంకయ్యస్వామి ఆలయంలో అన్నదానం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 30వ డివిజన్ శ్రామికనగర్‌లోని భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో ఆదివారం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సివిల్ ఇంజనీర్, అమ్మ పార్టీ వ్యవస్థాపకుడు బీఎన్ రాజు కుటుంబం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఏసీ స్టేడియంలో వైద్య శిబిరం

నెల్లూరు(విద్య), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పోబోలు సత్యం మాట్లాడుతూ నిత్యం మైదానికి వచ్చే వాకర్స్‌తోపాటు పలువురు మహిళలు, క్రీడాకారులు వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు తీసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి స్నేహ సురేష్, డాక్టర్ సత్యనాథ్, డాక్టర్ శ్రీనివాసకుమార్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు వేలూరు రంగారావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

అఖిల్ అహ్మద్‌కు డాక్టరేట్



నెల్లూరు (హరనాథపురం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కోటమిట్టకు చెందిన సామాజిక సేవకుడు, ఆడిటర్ మహమ్మద్ అఖిల్ అహ్మద్‌కు కేంబ్రిడ్జి యూనివర్సిటీ న్యాయ శాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. లండన్‌లోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ డీన్ సమితసేన్ శనివారం ఢిల్లీలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో అఖిల్ అహ్మద్‌కు డాక్టరేట్ పట్టాను అందజేశారు. న్యాయ శాస్త్ర సిద్ధాంతాలపై ఆయన సమర్పించిన వ్యాసానికి డాక్టరేట్ లభించింది.

నారాయణ ఆసుపత్రిలో క్యాన్సర్ విభాగం

● వైద్య సంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ బిజు రవీంద్రన్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆదివారం క్యాన్సర్ విభాగం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నారాయణ వైద్య విద్యాసంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ బిజు రవీంద్రన్ మాట్లాడుతూ చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా అన్నీ రకాల క్యాన్సర్ వ్యాధులకు ప్రత్యేక విభాగాన్ని అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి అంకాలజీ విభాగం ద్వారా క్యాన్సర్ రోగులకు అత్యుత్తమ చికిత్సలు అందించే వీలుంటుందని చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ విభాగంలో మెడికల్, సర్జికల్, రేడియేషన్ వైద్య చికిత్సలతోపాటు పాలియేటివ్ కేర్ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల ప్యాకేజీని అందిస్తున్నామన్నారు. ఈ మేరకు పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నారాయణ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ శ్రీవిద్య, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ మనోభిరామ్, రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ గురుసాయి రత్నప్రియ, రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, మెడికవర్ క్యాన్సర్ విభాగం హెడ్ డాక్టర్ బిందురెడ్డి, నారాయణ ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బాలాజీనగర్ సాయిదర్బార్ వద్ద ఆదివారం తెల్లవారుజామున పాండు రంగస్వామి ఆనంద అగ్నిగుండ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. అన్ని వయసుల వారు అగ్నిగుండ ప్రవేశం చేశారు. పండరి భజన, కోలాటం ఆకట్టుకున్నాయి. కొల్లపూడి శ్రీను తులసీరామ్ గురువులు సహకారం అందించారు. కార్యక్రమాలను సాయిదర్బార్ మందిర చైర్మన్ మధుసాయి, గౌరవ సలహాదారుడు పాబోలు రామసుబ్బయ్య పర్యవేక్షించారు.

పాండురంగ స్వామి ఆనంద అగ్ని గుండం తొక్కుతున్న చిన్నారి





పండలి భజన, కోలాటానికి సిద్ధంగా కళాకారులు

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

ఉదయగిరి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ఉపవాస దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. దీక్షబూనిన ముస్లింలు ఉదయం 4.30 గంట ల్లోపు సహర్ పేరుతో ఆహారాన్ని స్వీకరించారు. అనంతరం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటల తరువాత ఇఫ్తార్ విందు చేసి ఉపవాస దీక్షను విరమించారు. నెలరోజులపాటు ముస్లింలు ఈ ఉపవాస దీక్షలు చేయనుండడంతో మసీదు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉపాధ్యాయిని కుటుంబానికి సాయం

నెల్లూరు(విద్య), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన ఉపాధ్యాయిని బీ అంకమ్మ కుటుంబానికి బీటీఏ నేతలు ఆర్థిక సాయం అందించారు. నగరంలోని డైకస్‌రోడ్డులో నివాసం ఉండే అంకమ్మ కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.1.14లక్షలు అందచేశారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు నూకలపాటి రమణయ్య మాట్లాడుతూ బీటీఏలోని ఉపాధ్యాయులంతా కలిసి ఆర్థిక సాయాన్ని సమకూర్చారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్, లక్ష్మయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు చిన్నయ్య, అధ్యక్షుడు మణి సుబ్బు, కార్యదర్శి మాస ప్రసాద్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలి కుటుంబ సభ్యులకు చెక్కు అందచేస్తున్న బీటీఏ నాయకులు

9న 105 పనులకు శంకుస్థాపన

రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9వ తేదీన రూరల్ నియోజకవర్గంలో 105 ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయబోతున్నామని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం నగరంలోని ఆయన కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. 9వతేదీ 51 ప్రాంతాల్లో తానే స్వయంగా శంకుస్థాపనల్లో పాల్గొంటానని చెప్పారు. మిగిలిన 54 ప్రాంతాల్లో తన సోదరుడు టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, కూటమి పార్టీల నాయకులు హాజరవుతారన్నారు. ఈ పనులన్నింటినీ శంకుస్థాపన జరిగిన నాటి నుంచి 60 రోజుల్లో పూర్తిచేసి ప్రారంభోత్సవాలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, నాయకులు రాజానాయుడు, అరవ శ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

వీనులవిందుగా కృష్ణగాన మంజరి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంగీత విద్యాలయం 17వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కృష్ణగాన మంజరి ప్రేక్షకులకు వీనులవిందు చేసింది. ఆదివారం రాత్రి పురమందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంచికామకోటి పీఠం ఆస్థాన విద్వాంసుడు డాక్టర్ జీ చంద్రమౌళి హాజరయ్యారు. విద్యాలయం విద్యార్థులు వాగ్గేయకారుల కీర్తనలు, శ్రీకృష్ణ గీతాలను ఆలపించారు. అనంతబొట్ల రమాదేవి, కిషోర్, దువ్వూరు బెనర్జీ, కళాంజలి అనంత్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి వాయిద్య సహకారం రాయప్రోలు సుబ్రహ్మణ్యం , శాంతి కళాధర్, సంగీత సౌరభ్, ఈశ్వర్‌సాయ్ అందించారు.

'వెలుగు కార్యాలయం'లో కుంగిన ఫ్లోరింగ్

● ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



విడవలూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పొదుపు కార్యకలాపాలను నిర్వహించే వెలుగు కార్యాలయంలో ఫ్లోరింగ్ గత కొద్ది సంవత్సరాలుగా మరమ్మతులకు గురై అధికారులకు, మహిళలకు తీవ్ర ఇబ్బందులను కలుగజేస్తోంది. ఫ్లోరు మరమ్మతుతు చేయ్యాలని సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. 2017లో భారత్ నిర్మాణ్ రాజ్ గాంధీ సేవా కేంద్రాన్ని సుమారు రూ.32లక్షలతో ఈ భవనాన్ని అప్పటి కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సహకారంతో నిర్మించారు. కాలక్రమంలో భవనంలోపల ఉన్న ఫ్లోరింగ్ కుంగి పోయింది. లోపల వేసిన టైల్స్ ఎత్తు పల్లాలుగా ఉన్నాయి. దీంతో కార్యాలయంలో విధులు నిర్వర్తించే సీసీలు, ఏపీఎం, ఇతర కార్యాలయ సిబ్బంది నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. సమావేశాలకు కార్యాలయానికి వచ్చే మహిళలు జారీ పడుతున్న సంఘటనలు పలుమార్లు జరిగాయి. భవనం లోపల ఫ్లోరింగ్ మరమ్మతులు చేయ్యాలని గత వైసీపీ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేయ్యాలని పొదుపు మహిళలు కోరుతున్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. అనంతరం ఆశ్రమ స్థల దాత పొణక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం విద్యార్థులకు ఆశ్రమ చరిత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ అతిథిగృహం శిథిలం!

● కొత్త భవనం నిర్మాణానికి మోక్షమెప్పుడో..!



శిథిలమైన అతిథిగృహ భవనం

ముత్తుకూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : ఎందరో ప్రజా ప్రతినిధులకు... అధికారులకు ఆశ్రయమిచ్చిన అతిథిగృహం నేడు శిథిలావస్థకు చేరి పాడుబడిపోయింది. బ్రిటిష్ పాలకులు నిర్మించిన ముత్తుకూరు ఆర్అండ్‌బీ అతిథిగృహం కనీస మరమ్మతులకు నోచుకోక పనికిరాకుండాపోయింది. పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న ముత్తుకూరులో ఉన్న ఏకైక అతిథిగృహం ఇది. ఏళ్ల తరబడి సేవలందించిన అతిథి గృహంలో ప్రస్తుతం కనీస వసతులు కరువయ్యాయి. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు ఇక్కడే సభలు, సమావేశాలు నిర్వహించేవారు. ముత్తుకూరు నడిబొడ్డున విశాలమైన స్థలంలో ఉన్న ఈ అతిథిగృహాన్ని అభివృద్ధి చేసేందుకు ఎంతో అవకాశం ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఈ భవనం ప్రస్తుతం భూత్ బంగ్లాను తలపిస్తోంది. బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరా లేక అంధకారంలో మగ్గుతోంది. దెబ్బతిన్న మంచాలు, ఫర్నీచర్‌ను సంబంధిత అధికారులు తొలగించారు. ప్రత్యామ్నాయంగా ఎలాంటి సదుపాయాలు ఏర్పాటు చేయలేదు. కనీసం కూర్చునేందుకు ఎలాంటి సౌకర్యాలు లేవు. పై కప్పు పెంకులు వూడిపోయాయి. తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. ఇటీవలే ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పందించి అతిథిగృహ పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించమని అధికారులను ఆదేశించారు. ఎంతో వైభవం కలిగిన ఆర్అండ్‌బీ అతిథిగృహానికి పూర్వ వైభవం కల్పించేందుకు తాము కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టకపోతే బ్రిటిష్ కాలం నాటి ఈ అతిథిగృహం గత వైభవానికి చిహ్నంగా మారే ప్రమాదం ఉంది.

47 ఏళ్ల తరువాత అపూర్వ సమ్మేళనం



పూర్వ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం డీఎల్ఎన్ఆర్ హైస్కూల్లో ఆదివారం 47 ఏళ్ల క్రితం కలసి చదిన మిత్రులు అక్కటయ్యారు. ఈ పూర్వ విద్యార్థుల కలయికతో పాత జ్ఞాపకాలు, నూతనోత్సాహం రేకెత్తించింది. వారంతా 1977లో బుచ్చిలోని డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను ఆత్మీయంగా నెమరువేసుకున్నారు. వారి భవిష్యత్తు పరిణామాలు, స్థితిగతులు తెలియజేసుకు న్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను సత్కరించి సహపంక్తి భోజనం చేశారు. తమకు విద్య నేర్పిన గురువుల ప్రోత్సాహంతోనే అనేక రంగాల్లో స్థిరపడి ఈ రోజు ఈ వేదికపైన కలుసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నేలనూతల శ్రీధర్, తన్నీరు సుధాకర్, వకుళ భరణం, సుధీర్, లేబూరు హరి, మల్లికార్జునశర్మ, శేషయ్య, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన రచ్చబండ..!



కోవూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : గతంలో ప్రతి గ్రామంలో ఓ రచ్చబండ ఉండేది. రచ్చబండపై సంగీత సాహిత్య కార్యక్రమాలు మొదలు రాజకీయ కార్యకలాపాల వరకు ఆసక్తికరంగా చర్చలు సాగేవి. గ్రామీణుల్లో రచ్చబండ కబుర్లు ఎంతో ఆహ్లాదాన్ని నింపేవి. రచ్చబండలపై పగలు పొద్దస్తమానం యువకులు, వృద్ధులు చేరి పలు విషయాలు చర్చించుకొనేవారు. రోజులు మారాయి. రచ్చబండలు కనుమరుగయ్యాయి. కానీ.. మండల పరిధిలోని పాటూరులో వందలాది సంవత్సరాల నుంచి ఓ రచ్చబండ తనదైన శైలిలో నిలిచే వుంది. మహాభారతాన్ని ఆంధ్రీకరించిన తిక్కనకు పూర్వులు, వారసులు కూడా ఈ రచ్చబండపై చేరి సాహితీ సమరాంగణాన్ని పూరించినట్లు చెబుతారు. వందల సంవత్సరాలకు పూర్వం ఏర్పాటు చేసిన రచ్చబండ నేటికీ కనువిందుచేస్తోంది. గ్రామ యువకులు నేటికీ రచ్చబండపై నిప్పులు కురిసే వేసవిలో సైతం చేరి చర్చించుకొంటూ కన్పిస్తారు. రచ్చబండ పైభాగాన ఏర్పాటు చేసిన కప్పు ఆకర్షణీయంగా కన్పిస్తోంది. పై కప్పును పిరమిడ్ ఆకారంలో ఏర్పాటు చేసేందుకు లోపలిభాగంలో ఉంచిన సామగ్రిని స్థానికులు పదిలంగా కాపాడుతున్నారు. తాటి కప్పును పదేళ్లకో పర్యాయం మార్చినప్పటికీ రచ్చబండ రూపును యధాతథంగా వారసత్వ సంపదగా కాపాడుతుండటం విశేషం.

8 నుంచి భాగవత సప్తాహం




భాగవత సప్తాహం గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పొదలకూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : పొదలకూరు పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 15వ తేదీ వరకు భాగవత సప్తాహం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల రమణయ్యనాయుడు పేర్కొన్నారు. ఆదివారం కార్యక్రమ వివరాలు తెలియజేసే గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 8న శ్రీమత్‌భాగవత ప్రవచనం, రాంనగర్ గేట్ సెంటర్ నుంచి శ్రీనివాసలే అవుట్‌లోని దేవస్థానం వరకు త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి అడుగుజాడల్లో మహాశోభా యాత్ర, 9న నవైనతేయ ఇష్టి, 10న హయగ్రీవ ఇష్టి, 11న సుదర్శన ఇష్టి, 12న నారసింహ ఇష్టి, 13న వైభవ ఇష్టి, 14న లక్ష్మీనారాయణ ఇష్టి, 15న వాసుదేవ మంత్ర ప్రయుక్త హవనము, మహాపూర్ణాహుతి, రుక్మిణీ కల్యాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, మన్నెం శ్యామ్ ప్రసాద్‌నాయుడు, బొద్దులూరి మల్లికార్జుననాయుడు, బక్కయ్యనాయుడు, దేవరం రఘురామిరెడ్డి, అలుపూరు శ్రీనివాసులు, కృష్ణమనాయుడు, చొప్పా వెంకటేశ్వర్లు, వేణు తదితరులు పాల్గొన్నారు.

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కసుమూరు మస్తాన్‌వలీ దర్గాలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతోపాటు మన రాష్ట్ర నలమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించగా మరికొందరు అన్నదాన కార్యక్రమాలు చేపట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా మస్తాన్ స్వామి దర్గాను పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.


గిరి ప్రదక్షిణ కోసం శ్రీకాళహస్తి పురవీధుల్లో సాగుతున్న స్వామి అమ్మవార్లు


రామాపురం రిజర్వాయరు వద్ద సేద తీరుతున్న భక్తులు

దేవతలారా.. వెళ్లి రండి

కొండచుట్టుకు వెళుతూ వీడ్కోలు పలికిన ఆదిదంపతులు

కైలాసగిరుల చుట్టూ భక్తుల కోలాహలం

శ్రీకాళహస్తి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శివ పార్వతుల కొండ చుట్టు (గిరి ప్రదక్షిణ) వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా తమ కల్యాణానికి విచ్చేసిన సకల దేవతాగణాలు, మునులు, రుషులకు ఆది దంపతులు వీడ్కోలు పలికారు. కృతజ్ఞతలు తెలిపారు. తొలుత ఆలయంలోని యాగశాలలో కలశాలకు ప్రత్యేకపూజలు చేశారు. శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబదేవి ఉత్సవర్లను అలంకార మండపంలో అలంకరించి, పూజలు నిర్వహించాక చప్పరాలపై కొండచుట్టుకు తీసుకెళ్లారు. బేరివారి మండపం వద్ద బేరి కులస్థులు ఇచ్చిన నాగవల్లిని అమ్మవారికి ధరింపజేశారు. జయరామరావు వీధి, ఎన్టీఆర్ నగర్, తెలుగుగంగకాలనీ, కైలాసగిరి కాలనీ, రాజీవ్‌నగర్‌కాలనీ మీదుగా గిరిప్రదక్షిణ జరిగింది. రామాపురం రిజర్వాయరు సమీపంలోని అంజూరు మండపం వద్ద కాసేపు ఉత్సవర్లు సేదతీరారు. ఆలయం తరపున, దాతల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అక్కడ్నుంచి వెయ్యిలింగాలకోన, వేడాం మీదుగా శుకబ్రహ్మాశ్రమ సమీపంలోని ఎదురుసేవ మండపానికి సాయంత్రానికి చేరుకున్నారు. అక్కడ ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు స్వామి అమ్మవార్లకు స్వాగతం పలికారు. మండపంలో పూజల అనంతరం ఉత్సవమూర్తులను ముక్కంటి ఆలయానికి తీసుకొచ్చారు. కొండచుట్టుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో బాపిరెడ్డి, బొజ్జల రిషితారెడ్డి, ఉభయదారులు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దంపతులు, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, కంఠా రమేష్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఎదురుసేవ మండపం వద్ద స్వామి అమ్మవార్లు



అశ్వ, సింహ వాహనాలపై ఆది దంపతుల వైభవం

కైలాసగిరి ప్రదక్షిణ చేసి సకల దేవతా గణాలకు వీడ్కోలు పలికిన ఆదిదంపతులు రాత్రి 8 గంటల తర్వాత ఆలయానికి చేరుకున్నారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడు అశ్వ వాహనంపై, జ్ఞానప్రసూనాంబదేవి సింహ వాహనంపై అధిష్ఠించి పురవిహారం చేశారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.


కైలాసగిరుల్లో స్వామి అమ్మవార్ల ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో నేడు
ఉదయం 9గంటలకు: కేడిగ వాహనసేవ
సాయంత్రం 7 గంటలకు: ధ్వజావరోహణం
రాత్రి 9గంటలకు: సింహాసనం, కామధేనువు వాహనసేవ

● విజయవాడ నుంచి తిరుపతికి

● 20 ఏళ్ల యువకుడికి అమర్చిన వైద్యులు
● శ్రీపద్మావతి హృదయాలయలో 18వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స

'గుండె' ప్రయాణం


విమానాశ్రయం నుంచి ప్రత్యేక వాహనంలో గుండెను తీసుకువస్తున్న వైద్యులు

విజయవాడ నుంచి ఒక గుండె ప్రయాణం సాగింది. ఆ 32 ఏళ్ల వ్యక్తి గుండెను.. 20 ఏళ్ల యువకుడికి తిరుపతిలో అమర్చారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయవాడకు చెందిన ప్రదీప్ (32)కు అక్కడి క్యాపిటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యారు. అంత విషాదంలోనూ గుండె దిటవు చేసుకున్న అతడి కుటుంబ సభ్యులు.. మరొకరి ప్రాణం నిలిపేందుకు అవయవదానానికి ముందుకొచ్చారు. అదే సమయంలో గుండె సంబంధిత వ్యాధితో నెల రోజులుగా తిరుపతిలోని శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 20 ఏళ్ల యువకుడికి గుండె మార్పిడి చేయాల్సి ఉంది. జీవన్‌దాన్‌పోర్టల్‌లో ఈ వివరాలు నమోదు చేశారు. ఈ క్రమంలో ప్రదీప్ వియం తెలిసి శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి.. ప్రత్యేక బృందంతో శనివారం రాత్రి విజయవాడకు చేరుకున్నారు. ప్రదీప్ గుండెను ఆదివారం అంబులెన్సులో గన్నవరం విమానాశ్రయానికి.. అక్కడ్నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతి ఎయిర్‌పోర్టుకు సాయంత్రం 4.10గంటలకు తీసుకొచ్చారు. అప్పుడే సిద్ధంగా ఉన్న ప్రత్యేక అంబులెన్స్‌లో ఆ గుండెను పద్మావతి చిన్నపిల్లల హాస్పిటల్‌కి తరలించారు. గుండె ప్రయాణ సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారు. 4.30 గంటలకంతా శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రికి గుండె చేరుకుంది. ఆ వెంటనే గుండె మార్పిడి శస్త్రచికిత్స చేపట్టారు.
కాగా, శ్రీపద్మావతి హృదయాలయలో ఇప్పటి వరకు 17 శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. ఇది 18వది.

- తిరుపతి(వైద్యం) / రేణిగుంట, ఆంధ్రజ్యోతి

10 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురు తమిళనాడువాసుల అరెస్టు

తడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్లు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. తడ మీదుగా చెన్నైకు గంజాయి తరలిస్తున్నట్లు శనివారం పోలీసులకు సమాచారం అందింది. శనివారం రాత్రి నుంచి వాహనాల తనిఖీ చేపట్టడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఆదివారం తెల్లవారుజామున శ్రీసిటీకి జీరో పాయింటు సమీపంలో ముగ్గురు వ్యక్తులు బ్యాగులు ధరించి అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా సుమారు రూ.లక్ష విలువైన పది కిలోల గంజాయి లభ్యమైంది. నిందితులు తమిళనాడు రాష్ట్రం తిరవళ్లూరు జిల్లా తిరునింద్రపూర్ గ్రామానికి చెందిన హరీష్, చెన్నై నుంగంబాకం ప్రాంతానికి చెందిన కే.వడివేలు అలియాస్ వేలు, బి.కార్తికేయన్ అలియాస్ కార్తీగా తెలిసింది. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన ఎస్ఐ కొండప్ప నాయుడు, సిబ్బందిని అభినందించారు.


పట్టుబడ్డ గంజాయి, నిందితులతో సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండప్ప నాయుడు

పుత్తూరు మున్సిపాలిటీలో కొనసాగుతున్న విచారణ!

పుత్తూరు అర్బన్, మార్చి2(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ విచారణ కొనసాగింది. పురపాలక శాఖ రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలోని కమిటీ సభ్యులు ప్రధానంగా అకౌంట్స్, ఇంజనీరింగ్ విభాగాల్లో రికార్డుల తనిఖీ చేపట్టారు. కమిటీ సభ్యులైన ఏవో ప్రకాష్, ఆర్వో నాజర్ హుస్సేన్, డీఈ మోహన్, ఏఈ పవన్‌కుమార్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు వినోద్ ప్రీతం, ఉమామహేశ్వర్ రెడ్డి ఆదివారం తమ విధుల్లో బిజీగా కనిపించారు. వీరికి మున్సిపల్ కార్యాలయ సిబ్బంది సహకరించారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, పారిశుధ్య విభాగాల్లో తనిఖీలు పూర్తి కాగా, అకౌంట్స్, ఇంజనీరింగ్ విభాగాల్లో కొనసాగుతోంది. సోమవారం నాటికి అకౌంట్స్ విభాగంలో తనిఖీలు పూర్తవుతాయని కమిటీలోని ఓ అధికారి తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో తనిఖీలు ఈనెల 5వ తేదీ వరకు కొనసాగే అవకాశం ఉందన్నారు. పుత్తూరు మున్సిపాలిటీలో ప్రధానంగా ఇంజనీరింగ్ విభాగంలో అవినీతి చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు ఉండటంతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

బూదనం టోల్‌ప్లాజా వద్ద అఘోరి హల్‌చల్

చిల్లకూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద శనివారం అర్ధరాత్రి లారీల్లో గోవులను అక్రమంగా తరలిస్తున్నారని అఘోరి అడ్డుకుని కొద్దిసేపు హల్‌చల్ చేశారు. స్థానికుల వివరాల మేరకు.. పిఠాపురానికి చెందిన కొందరు రైతులు మదనపల్లె నుంచి రెండు లారీలలో గోవులను తీసుకెళుతున్నారు.అదే సమయంలో నెల్లూరు వైపు కారులో వెళుతున్న అఘోరి.. గోవులు తరలిస్తున్న లారీలను బూదనం టోల్‌ప్లాజా వద్ద అడ్డుకున్నారు. గోవులను వధించేందుకు అక్రమంగా తలిస్తున్నారని రైతులతో వాదనకు దిగారామె. తాము రైతులమని, వాటిని పెంచుకునేందుకు తీసుకెళుతున్నామని చెప్పినా వినలేదు.స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు.. అఘోరికి నచ్చచెప్పినా పట్టించుకోకుండా వారితోనూ వాదనకు దిగారు. ఆ తర్వాత రైతులు గోవులను తీసుకెళ్లారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలు

తిరుపతి(విద్య), మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 86 కేంద్రాల్లో 29,448 మంది జనరల్ విద్యార్థులు, 1100 మంది ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 30,548 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రథమ సంవత్సర పరీక్షలు శనివారం ప్రారంభమైన విషయం విదితమే.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమవారం) : 6.24
సహరి (మంగళవారం) : 5.09

ప్చ్.. పచ్చి మిర్చి

● దిగుబడి చేతికొచ్చే వేళ పడిపోయిన ధరలు

పచ్చి మిరప.. పంట చేతికొచ్చేసరికి ధరల ఘాటు తగ్గింది. పెట్టుబడి కూడా రాని పరిస్థితి తలెత్తింది. సముద్రతీర ప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరులలో ఈ ఏడాది నేలబావులు, ఫిల్టర్‌పాయింట్లు, చెరువుల కింద రైతులు మిరప సాగు చేపట్టారు. మరోవైపు సీజన్‌లో వర్షాలు లేకపోవడం, నవంబరు నుంచి డిసెంబరు వరకు వరదలు ముంచెత్తడంతో వరి, వేరుశనగ, చెరకు పంటలను సాగుచేయలేక సూళ్లూరుపేట, నాయుడుపేట వ్యవసాయ సబ్ డివిజన్లలోని ఎక్కువమంది రైతులు పచ్చిమిర్చి వైపు దృష్టి పెట్టారు. దీంతో ఒకప్పుడు మెట్ట ప్రాంతాలకే పరిమితమైన మిర్చిని ఈ ప్రాంతాల్లోనూ దాదాపు 10 వేల ఎకరాలకుపైగా సాగు చేశారు. సూళ్లూరుపేట ప్రాంతంలోని మంగళంపాడు, మతకాముడి, ఉగ్గుముడి, సుగ్గుపల్లి, మంగానెల్లూరు, దామానెల్లూరు, వెలగలపొన్నూరు, ఉచ్చూరు ప్రాంతాల్లో విస్తృతంగా మిరప సాగు చేపట్టారు. తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకున్నారు. గతేడాదికంటే ఈసారి పచ్చి మిరప కాయలు ఎక్కువ దిగుబడి వచ్చాయి. అదే సమయంలో ధరలు పడిపోవడంతో రైతులు కుమిలిపోతున్నారు. సూళ్లూరుపేట ప్రాంతంలో రైతులు మేలురకం మిరప జాతులైన ఇండాం-5, ఇండాం-67, ప్రియాంక, వజ్ర, నాందారి, సున్నా-56, జేకే రకాలను సాగు చేసి.. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేవారు. దీంతో ఎకరాకు రూ.లక్షకు పైగా ఆదాయాన్ని పొందేవారు. ఇప్పుడు దిగుబడుల వేళ కిలో రూ.13 నుంచి రూ.15 మధ్యలో ధర పలకడంతో నష్టపోతున్నారు. గతేడాది అక్టోబరులో కిలో మిర్చి రూ.30 నుంచి రూ.40 వరకు ధర పలికేది. గతేడాఇ ఇదే సీజన్‌లో కిలో రూ.40 నుంచి 60 వరకు కూడా పలికింది. పండు మిర్చి కూడా ఒకప్పుడు కిలో రూ.220 ఉండగా నేడు రూ.100 నుంచి రూ.120కి పడిపోయింది.

తప్పని నష్టం

ఎకరా మిర్చి సాగుకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతోంది. ప్రస్తుతం మిర్చి ధర మార్కెట్‌లో టన్ను రూ.10 వేల నుంచి రూ.13 వేలు మాత్రమే పలుకుతోంది. ఎకరాకు 5 టన్నుల దిగుబడి వచ్చినా నష్టం చవిచూడక తప్పడం లేదు. అధిక పెట్టుబడులు పెట్టి ఏపుగా పంటను పండించిన రైతులు నేడు ధరలు పడిపోవడంతో నష్టాలకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక, కోట ప్రాంతంలో ఎక్కువగా కౌలు రైతులు ఒక్కో ఎకరాన్ని సీజన్‌ను బట్టి రూ.25వేల నుంచి రూ.30వేల వరకు లీజుకు తీసుకుని మిరపసాఆగు చేపట్టారు. పెట్టుబడులు, లీజులుకూడా రాకపోవడంతో (ధరలపరంగా) వీరంతా లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం ఆయా మండలాలలో పచ్చి మిరపకాయలను అమ్ముకొని చివరితడిలో పండు మిరపకాయలుగా ఎండబెట్టి సొమ్ము చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

- కోట/సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి





మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మురళీరెడ్డి (ఫైల్‌ఫొటో)

గూడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు సమీపంలో మోటారు సైకిల్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు... మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన అల్లూరు మురళీరెడ్డి(58), రమణారెడ్డి ఆదివారం వేకువజామున గ్రామ సమీపంలోని కటాలమ్మగుడి వద్ద వాకింగ్ చేసేందుకు వెళ్లారు. తిరిగి మోటరుసైకిల్‌పై గ్రామానికి వస్తుండగా ఆలయ సమీపంలో తిప్పవరప్పాడు నుంచి గూడూరు వైపు వెళుతున్న ఓ కారు అదుపుతప్పి ముందు వెళుతున్న మోటరుసైకిల్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మురళీరెడ్డి అక్కడికక్కడికే మృతిచెందగా, రమణారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. రమణారెడ్డికి స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. మురళీరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సేవా గుణాన్ని చాటుకోవాలి



వాహనశాల, అర్చక నివాసం నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ తమకు ఉన్నంతలో కొంత సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ సేవా గుణాన్ని చాటుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక అళఘనాథ స్వామి ఆలయంలో పాలక మండలి మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి దాతృత్వంతో నిర్మించిన వాహనశాల, అర్చక నివాసం, వంటశాల భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకుని ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ప్రాచీనమైన, ప్రసిద్ధి చెందిన అళఘనాథస్వామి ఆలయంలోని వాహనశాల, వంటశాల, అర్చకుల నివాసం శిథిలావస్థకు చేరుకోవడంతో బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి ముందుకు వచ్చి నూతన భవనాలను నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శశాంక్, బొమ్మిరెడ్డి సురేంద్ర రెడ్డి, డాక్టర్ జనార్దనరెడ్డి, మునిగిరీష్, దశరథరామిరెడ్డి, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, అనిల్ కుమార్, తూపిలి సురేంద్ర, అర్చకుడు సత్యఅశోక్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల్లో ప్రోత్సహించేందుకు సహకారం



విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న బలిజ మహిళా సంక్షేమసంఘం సభ్యులు

గూడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చదువుల్లో ప్రతిభ చాటే విద్యార్థినులను ప్రోత్సహించేందుకు బలిజ మహిళా సంక్షేమ సంఘం సహకారం అందిస్తుందని ఆ సంఘ గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో పట్టణానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థినులు సాయిసురేఖ, మాధురికి అమెరికల్ ప్రోగ్రెసీ తెలుగు అసోసియేషన్ సహకారంతో రూ.20వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పద్మావతి, సువర్ణలక్ష్మి, ఉమాదేవి, సరోజనమ్మ, ఉషా, సారంగం శ్రీనివాసులు తతితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

గూడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని దళారులు, మిల్లర్ల యజమానులు తక్కువ ధరకు కొనుగోలు చేసి మోసం చేస్తే కఠిన చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. రైతులు ఎంతో పెట్టుబడులు పెట్టి పండించిన ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుంటే మధ్యలో దళారులు, మిల్లర్ల యజమానులు తక్కువ ధరకు కొనుగోలు చేసి మోసాలకు పాల్పడడాన్ని సహించబోమన్నారు. ప్రభుత్వం పుట్టికి రూ.19.750 మద్దతు ధర అందిస్తుంటే దళారులు రూ.17వేలు మాత్రమే చెల్లిస్తూ రైతులను మోసం చేయడం తగదని ఎమ్మెల్యే అన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ సుజన, కేశబ్ మహంత, అతుల్ బోరా

తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూల మూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకున్న సుజనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే అసోం రాష్ట్ర మంత్రులు కేశబ్ మహంత, అతుల్ బోరా కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి ఆలిండియా పోస్టల్ క్యారమ్ టోర్నీ



లోగోను ఆవిష్కరిస్తున్న సంతోష్‌నేత

తిరుపతి(క్రీడలు), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తపాల ఉద్యోగుల్లో ఐక్యత పెంచేందుకు ఏపీ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో తిరుపతిలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు ఆలిండియా పోస్టల్ క్యారమ్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు ఏపీ ముఖ్య పోస్టుమాస్టర్ కె.సంతోష్‌నేత తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇందిరా మైదానంలోని మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు హాజరవుతారని పేర్కొన్నారు. అనంతరం టోర్నీ లోగోను ఆవిష్కరించారు. చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ప్రకాష్, తిరుపతి ఎస్పీవో నారాయణప్ప, వెంకటరెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

రేపు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

వెంకటగిరి టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీలోని శ్రీనివాసన్ సేవాసంస్థ (టీవీఎస్) సుందరం క్లైటన్ లిమిటెడ్ కార్యాలయంలో ఈ నెల 4వ తేదీ మంగళవారం ఉదయం 9 నుంచి 12గంటలకు వరకు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ క్లస్టర్ ఇన్‌ఛార్జి జయసింగ్ ఆదివారం తెలిపారు. 2020 నుంచి 2025 మధ్య ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులు అర్హులన్నారు. 18నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగి, అవివాహితులై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 76618 20405, 96523 00414, 91771 24827, 93925 56735, 93905 74591 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

వాకాడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారిణి దీప కోరారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. తేమ 17శాతం కంటే తక్కువగా ఉన్న ధాన్యాన్ని క్వింటాలుకు రూ.2,325 మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామన్నారు. రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేస్తే షెడ్యూల్, తేమ శాతం, రవణా తదితర అంశాలను తెలుసుకోవచ్చన్నారు. అలాగే సహకార సంఘం (పీఏసీఎస్) ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

- ఎడారిగా మారుతున్న గ్రామాలు
- అమలుకు నోచుకోని వాల్టా చట్టం



కోగిలి వద్ద రోడ్డు పక్కన నరికివేసిన వేప చెట్టు - కొత్తగుంట పెట్రోలింగ్ సమీపంలో నిల్వ చేసిన వేప, కానుగ, కరతుమ్మ చెట్ల కలప

చిట్టమూరు, మార్చి2 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటాలి... పర్యావరణాన్ని కాపాడాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరు గారుతోంది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వంతో పాటు పర్యావరణ పరిరక్షణ సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. చెట్లను రక్షించే వాల్టా చట్టం అమలుకు నోచుకోవడం లేదు. కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరికి కలప విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో ఇటుక బట్టీలు, బొగ్గు తయారీకి కలప అవసరం కావడంతో డిమాండ్ నెలకొంది. దీంతో ప్రభుత్వ భూములు, ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలపై అక్రమార్కులు కన్నేశారు. కరతుమ్మ చెట్ల నుంచి వేప వరకు ఏదీ వదిలి పెట్టకుండా నరికేస్తున్నారు. మండలంలో తీరప్రాంత గ్రామాలైన కోగిలి, ఎల్లూరు, బురదగాలి, కొత్తపాళెం, కుమ్మరిపాళెం గ్రామాల్లో కరతుమ్మ చెట్లు అత్యధికంగా ఉన్నాయి. ఈ చెట్లను నరికేందుకు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో యథేచ్ఛగా నరికి విక్రయాలు సాగిస్తున్నారు. ఇక ఇంటి గృహోపకరణలకు కిటికీలు, ద్వార బంధనాలకు, వేప కొయ్యను ఎక్కువగా వాడుతుంటారు. అటువంటి విలువైన చెట్లను నరికి కోట, నాయుడుపేట ప్రాంతాల్లోని కొయ్య మిల్లులకు, ఇటుక బట్టీలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విచ్చలవిడిగా చెట్లను నరికి తరలిస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండలంలో వృక్ష సంపదను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



గోతులమయంగా ఉన్న వెంకటగిరి - నాయుడుపేట రోడ్డు

అడుగడుగునా గోతులే

వెంకటగిరి - నాయుడుపేట రోడ్డులో దుర్భరంగా మారిన ప్రయాణం

వెంకటగిరి టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి - నాయుడుపేట రోడ్డు గోతులుతేలి ప్రయాణం దుర్భరంగా మారింది. పట్టణంలోని కోళ్లపారం నుంచి ఏపీ మోడల్ స్కూల్ వరకు 400 మీటర్ల దారిలో 20 గోతులు ఏర్పడ్డాయి. వర్షం పడితే ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. కొన్నిచోట్ల అడుగు లోతుగుంతలు ఏర్పడి ప్రయాణం నరకంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్ల అభివృద్ధి దృష్టి సారించినా వెంకటగిరి - నాయుడుపేట మార్గాన్ని పట్టించుకోవడంలేదు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరగా ఆ దారి రైల్వేశాఖకు సంబంధించినదని చేతులు ఎత్తేశారు. ప్రజాప్రతినిధులు స్పందించి వెంకటగిరి - నాయుడుపేట మార్గాన్ని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాళెంకోటలో ప్రభుత్వ భూముల కబ్జా



ప్రభుత్వ భూములను చదును చేసేందుకు చెట్లను తొలగించిన దృశ్యం

వెంకటగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి సమీపంలోని పాళెంకోట గ్రామ సర్వే నెంబరు 4,5,6,7,8లో సుమారు 83 ఎకారాల ప్రభుత్వ భూమి కబ్జా జరుగుతోంది. మూడు రోజులుగా యంత్రాలతో ప్రభుత్వ భూమి చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. మూడు రోజుల నుంచి ఎక్స్‌కవేటర్లు, డోజర్ల సాయంతో చెట్లు తొలగించి చదును చేస్తున్నా రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పాళెంకోటలో ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ ఫలితాలను సాధించాలి



విద్యాసామాగ్రిని అందజేస్తున్న రోటరీవెస్ట్ క్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థినులు ధైర్యంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలను సాధించాలని రోటరీ వెస్ట్‌క్లబ్ సభ్యులు అన్నారు. ఆదివారం స్థానిక బనిగీసాహెబ్‌పేటలోని బీసీ గురుకుల బాలికల పాఠశాలలో రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు పరీక్షా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు ఒత్తిడికి లోనుకాకుండా ఏకాగ్రతతో పరీక్షలు రాస్తే విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ధనుంజయరెడ్డి, గిరిబాబు, సత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, సిద్దారెడ్డి, హరినాథరెడ్డి, అంజని తదితరులు పాల్గొన్నారు.

బీపీహెచ్‌యూ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

దొరవారిసత్రం, మార్చి2(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రంలో ప్రభుత్వ వైద్యశాల పక్కన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే విజయశ్రీ ఆదివారం భూమిపూజ చేశారు. 2023 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులతో బీపీహెచ్‌యూ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసింది. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ పేదలకు మంచి వైద్యం అందించాలన్న లక్ష్యంతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణం చేపట్టామని, ఇందులో డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీహరిరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, మురళీరెడ్డి, ఇట్టగుంట రత్నయ్య, షబ్బీర్, ప్రసాద్ నాయుడు, నాగేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత డీఎంహెచ్‌వో రమణయ్య మృతి



డాక్టర్ రమణయ్య (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటకు చెందిన విశ్రాంత డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రమణయ్య ఆదివారం మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో నెల్లూరులోని నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం మృతి చెందాడు. రమణయ్య స్వగ్రామమైన నాయుడుపేట మండలం బీరదవాడలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలపారు.

26న అన్నమాచార్య వర్ధంతి

తిరుమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు తొలి వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల వర్ధంతి ఈనెల 26వ తేదీన తిరుమలలో నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగింపుగా శ్రీవారి ఆలయం నుంచి బయల్దేరి నారాయణగిరి ఉద్యానవనంలోని పద్మావతి పరిణయోత్సవ వేదికపైకి వేంచేపు చేస్తారు. ప్రముఖ కళాకారులతో దినము ద్వాదశి సంకీర్తనలు, సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం నిర్వహిస్తారు. పలువురు పీఠాధిపతులు అనుగ్రహభాషణం చేస్తారు.

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె

తిరుపతిరూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారమూ కొనసాగింది.

చెత్త ద్వారా సంపద తయారీ

వాకాడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా చెత్త సేకరణ చేపట్టి సంపద సృష్టించవచ్చని ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని పంచాయతీల్లో ఆదివారం తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించారు.

కోటమ్మకు ప్రత్యేక పూజలు

కోట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకారంలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భగవద్గీతపై అవగాహన

వెంకటగిరి టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక టీచర్స్ కాలనీలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రహ్మణ్యం ఆదివారం భగవద్గీతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరత్నమ్మ, వెంకటలక్ష్మి, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం నాటి హుండీ ఆదాయం రూ.2.84 కోట్లు లభించింది.

భక్తుల కోసం మరిన్ని టాయిలెట్ల నిర్మాణం

అదనపు క్యూలైన్ల వద్ద రూ.3.36 కోట్లతో పనులు



క్యూలైన్ల వద్దనున్న తాత్కాలిక మరుగుదొడ్లు - క్యూలైన్‌కు అనుసంధానం చేస్తూ ఇటీవల నిర్మించిన శాశ్వత టాయిలెట్

తిరుమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో అదనపు క్యూలైన్ల వద్ద శాశ్వత టాయిలెట్ల నిర్మాణానికి టీటీడీ సిద్ధమవుతోంది. దీనికోసం టీటీడీ ఇటీవల రూ.3.36 కోట్లు మంజూరు చేస్తూ తీర్మానించింది. దీంతో టీటీడీ ఇంజినీరింగ్ విభాగం టెండర్ల ప్రక్రియకు ప్రణాళికలు రూపొందిస్తోంది. సాధారణంగా దర్శనానికి వచ్చే భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలోనూ వేచి ఉంటారు. ఇక్కడ సౌకర్యాలు బాగానే ఉన్నాయి. అయితే వారాంతాలు, పర్వదినాల సమయంలో సర్వదర్శన క్యూలైన్ పెరిగిపోతోంది. కృష్ణతేజ విశ్రాంతి భవనం నుంచి శిలాతోరణం సర్కిల్, బాటగంగమ్మ ఆలయం మీదుగా ఆక్టోపస్ సర్కిల్ వరకు వ్యాపిస్తోంది. దీంతో వెలుపల క్యూలైన్లలో ఉండే భక్తులు టాయిలెట్ల విషయంలో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరిలు గుర్తించారు. క్యూలైన్లతో పాటు శాశ్వత టాయిలెట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఔటర్ రింగు రోడ్డులోని కృష్ణతేజ సర్కిల్ నుంచి ఆక్టోపస్ సర్కిల్ వరకు శాశ్వత క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఐదు టాయిలెట్లను కూడా ఏర్పాటు చేశారు. గతేడాది డిసెంబరు 24న జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో మరో ఆరు శాశ్వత టాయిలెట్ల బ్లాక్స్ ఏర్పాటుకు చేయాలని తీర్మానించారు. అళ్వార్ ట్యాంక్ విశ్రాంతి భవనాల నుంచి బాటగంగమ్మ సర్కిల్ వరకు వీటిని ఏర్పాటు చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణాలను ప్రారంభించనున్నారు.

గోవుల అదృశ్యం

గూడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా పట్టణంలోని గాంధీనగర్, తిలక్‌నగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో సుమారు 10 గోవులు అదృశ్యం అయ్యాయని పాడిరైతులు ఆవేదన చెందుతున్నారు. మేతకు వెళ్లిన గోవులు తిరిగి రాకపోవడంతో పలు ప్రాంతాల్లో గాలించినా కనిపించలేదన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తిరుచ్చిపై సుందరరాజస్వామి అభయం



మాడవీధుల్లో ఊరేగుతున్న సుందరాజస్వామి

తిరుచానూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి ఆదివారం బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాబాద్రను పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవర్లకు అభిషేకం చేశారు. రాత్రి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా బెంగళూరుకు చెందిన అమృతవర్షిణి ఫౌండేషన్ ఫర్ ఆర్ట్స్ కళాకారులు ఆదివారం ప్రదర్శించిన నృత్యరూపకం అలరించింది. కళాకారులు ఇర్షికా ఎస్.కృష్ణమూర్తి, విద్యా విశ్వనాథన్, అదితి ఉల్లాల్, జీవిత, దేవి సంవర్ధిని, కీర్తి వర్ధిని తదితరులు పుష్పాంజలి, గజాననయుతం, శ్రీమన్నారాయణ, వర్ణం, చంద్రచూడ, థిల్లానా, పాండురంగాష్టకం వంటి కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

